

కేజీహెచ్‌లో తాగునీటి కష్టాలు!

- వార్డుల్లో ఇతర అవసరాలకూ నీరు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు
- బాత్రూమ్‌లను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసనను భరించలేకపోతున్నామంటున్న రోగులు
- సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు పటిష్ఠ చేపట్టాలని రోగులు, సహాయకుల వేడుకోలు

కొళాయిల నుంచి నీరు లభ్యం కాక బయట వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకుంటున్న రోగుల సహాయకులు



కేజీహెచ్ భావనగర్ వార్డు ఎదుట ఉన్న కొళాయిల వద్ద నీటి కోసం రోగుల సహాయకుల పడిగాపులు





గైనిక్ వార్డు వద్ద నీరు రాని కొళాయిలు



కార్డియాలజీ విభాగంలో నీరు రాకున్నా విద్యుత్ షాక్ కొడుతున్న ఆర్వో ప్లాంట్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్‌లో తాగునీటి కోసం రోగులు, వారి బంధువులు అల్లాడిపోతున్నారు. తాగడానికి గుక్కెడు నీళ్లు లభ్యం కాకపోతుండడంతో రోగులు, వారి సహాయకులు బయట వాటర్ బాటిళ్లను కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. గత మూడు, నాలుగు వారాల నుంచి తాగునీటితో పాటు ఇతర అవసరాలకు సరిపడా నీరు లేకపోవడంతో అనేక వార్డుల్లో రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్పత్రిలో పలుచోట్ల తాగునీటి అవసరాలను తీర్చేందుకు గాను కొళాయిలను ఏర్పాటు చేశారు. అయితే వాటి నుంచి నీరు రావడం లేదని రోగులతో పాటు వారి కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకరోజు ఆయా కొళాయిల ద్వారా నీరొస్తే.. ఆ తరువాత రెండు, మూడు రోజుల వరకు రావడం లేదని, వచ్చిన రోజు కూడా రెండు, మూడు గంటలు మాత్రమే నీరు వస్తోందని వారు చెబుతున్నారు.

కేజీహెచ్ భావనగర్ వార్డు ఎదురుగా, పాత బ్లడ్ బ్యాంక్ వద్ద, క్యాజువాల్టీ ఆవరణలో ఉన్న కొళాయిల నుంచి అయితే అసలు నీరే రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగుల సహాయకులు తాగునీటి కోసం వాటర్ బాటిళ్లు పట్టుకుని అనేక వార్డులు తిరగాల్సి వస్తోంది. అన్నిచోట్లా ఇదే పరిస్థితి నెలకొనడంతో తాగునీటిని బయట కొనుగోలు చేసి దాహార్తిని తీర్చుకుంటున్నామని ఓ రోగి సహాయకురాలు రాధ తెలిపారు. కాగా ఆస్పత్రిలోని ఒక సూపర్ స్పెషాలిటీ బ్లాక్ వద్దనున్న కొళాయి నుంచి మాత్రమే నీళ్లు వస్తున్నాయి.

వార్డుల్లో తీవ్ర ఇబ్బందులు

తాగడానికే కాకుండా వార్డుల్లో ఇతర అవసరాలకు వినియోగిం చేందుకు కూడా నీరు లేకపోవడంతో రోగులతో పాటు నర్సింగ్ సిబ్బంది, ఇతర స్టాఫ్ నానాపాట్లు పడుతున్నారు. నీటి సరఫరా లేకపోవడంతో అనేక వార్డుల్లోని బాత్రూమ్‌ల నుంచి వస్తున్న దుర్వాసనను భరించలేకపోతున్నామని.. వార్డుల్లో ఉండలేకపోతున్నా మని రోగులు వాపోతున్నారు. నీటి కొరతతో బాత్రూమ్‌లను శుభ్రం చేయడం లేదని, పరిస్థి తులు ఇలాగే ఉంటే మరిన్ని వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని రోగుల సహాయ కులు భయాందోళన చెందుతున్నారు. ఈ విష యాన్ని ఉన్నతాధికారుల దృష్టికి కొందరు రోగుల సహాయకులు తీసుకువెళ్లినా ... మిగతా 6వ పేజీలో

చంద్రంపాలెం వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి

పరిపాలన ఆమోదం తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

- నిర్మాణ వ్యయం రూ.3.23 కోట్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు




మధురవాడలోని చంద్రంపాలెం కూడలి

విశాఖపట్నం/కొమ్మాది, మే 14 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) జోన్-2 ఆరో వార్డు పరిధి లోని చంద్రపాలెం ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారిపై రూ.3.23 కోట్లతో ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి (ఎఫ్‌వోబీ) నిర్మాణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర మునిసిపల్ శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రపాలెం ఉన్నత పాఠశాలలో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరితోపాటు మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వారంతా చంద్రంపాలెం వద్ద జాతీయ రహదారిని దాటుకుని ప్రతిరోజూ రాకపోకలు సాగిస్తుంటారు. దీని వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో చంద్రంపాలెం ఉన్నత పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని ఎప్పటినుంచో ప్రతిపాదన ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సాధారణ ఎన్నికలకు ముందు అప్పటి ప్రజాప్రతినిధులు ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి హడావుడిగా శంకుస్థాపన కూడా చేశారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పరిపాలన ఆమోదం రాకపోవడంతో ఆ పనులు చేపట్టకుండా వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చంద్రంపాలెంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణ ఆవశ్యకతను స్థానిక ప్రజాప్రతినిధులు సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఎఫ్‌వోబీ అవసరం ఎంతైనా ఉందని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం రూ.3.23 కోట్లతో పనులను ప్రారంభించేందుకు పరిపాలన ఆమోదం తెలిపింది. దీంతో చంద్రంపాలెం పాఠశాల వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కల త్వరలో నెరవేరబోతుందని మధురవాడ పరిసర ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

తప్పుడు సర్టిఫికెట్లతో న్యాయవాదులు

ఆ 17 మందిలో ఒక్క ఉమ్మడి విశాఖ నుంచే ఐదుగురు..



విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి న్యాయవాదులుగా కొనసాగుతున్నారంటూ ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ తాజాగా 17 మంది న్యాయవాదులను రాష్ట్రవ్యాప్తంగా తొలగించింది. ఇందులో ఐదుగురు ఒక్క ఉమ్మడి విశాఖ నుంచే ఉండడం గమనార్హం. వీరిలో ఇద్దరు మహిళలు కావడం శోచనీయం. ప్రభుత్వ సంస్థలు ఉద్యోగ నియామకం చేసినప్పుడు ఎంపికైన అభ్యర్థుల నుంచి సర్టిఫికెట్లు తీసుకుని, ఆ తరువాత వాటిని వెరిఫికేషన్ చేసుకోవడం రివాజు. ఆ విధంగానే బార్ కౌన్సిల్ కూడా న్యాయవాదులుగా పేర్లు నమోదు చేసుకుని ప్రాక్టీస్ చేసేవారి నుంచి విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను సమర్పించమని కోరుతుంది. వాటిని పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే 'సర్టిఫికెట్ ఆఫ్ ప్రాక్టీస్' జారీ చేస్తుంది. అదేవిధంగా ఏడాదికి కనీసం ఒక కేసు అయినా వాదించాల్సి ఉంటుంది. వాటి వివరాలు కూడా సమర్పించాలి. ఇవేమీ లేనివారిని అనర్హులుగా ప్రకటించి బార్ కౌన్సిల్ నుంచి తొలగిస్తుంది. ఆ విధంగానే ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల సర్టిఫికెట్లను కోరింది. వాటిని పరిశీలనకు పంపితే విశాఖ జిల్లాకు చెందిన వారిలో ఐదుగురి సర్టిఫికెట్లు నకిలీవని తేలింది. దీంతో వారిని కౌన్సిల్ నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. అంతేకాక ఆ సర్టిఫికెట్లపై వివరణ కోరింది. ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి దేవరాపల్లి మండలం మామిడిపల్లికి చెందిన నక్కెళ్ల సత్యవతి (2019 నుంచి ప్రాక్టీస్), రామా టాకీస్ సమీపాన శ్రీనగర్‌కు చెందిన గేదెల రాజశేఖర్ (2020 నుంచి ప్రాక్టీస్), భీమిలి మండలంలోని బోరపేట (దొరతోట)కు చెందిన ఎంవీ మహేశ్వరరావు (2023 నుంచి ప్రాక్టీస్), గాజువాక సమీపంలోని ములగాడ కాలనీకి చెందిన ఎల్లపు నవీన్ (2021 నుంచి ప్రాక్టీస్), గాజువాకలో ప్రాక్టీస్ చేస్తున్న విశ్వేశ్వరాయ నగర్‌కు చెందిన మేడిత ప్రవీణ (2022 నుంచి ప్రాక్టీస్)లను తొలగించారు. వీరిలో కొందరు సరైన గుర్తింపులేని విద్యా సంస్థల్లో చదివినట్టు సర్టిఫికెట్లు పెట్టారు. విచారణలో సరైన వివరాలు లేవని నిర్ధారించుకున్నాకే బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. సరైన అర్హత లేకుండా తప్పుడు పత్రాలు సమర్పించిన ఈ న్యాయవాదులు వారి కేసుల్లో సమర్పించిన సాక్ష్యాలు ఇంకెంత ఫేక్ అయి ఉంటాయోనని నగరంలో చర్చ జరుగుతోంది.

డిప్యూటీ మేయర్ ఎంపిక నిర్ణయం మీదే..

జీవీఎంసీ మేయర్, ఎమ్మెల్యేలకు సూచించిన సీఎం చంద్రబాబునాయుడు!

- ఆశావహుల్లో కొనసాగుతున్న ఉత్కంఠ

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పదవికి ఎవరిని ఎంపిక చేయాలనే అంశంపై స్థానికంగా అందరూ కలిసి సమష్టి నిర్ణయం తీసుకోవాలని మేయర్ పీలా శ్రీనివాసరావుతోపాటు నగరానికి చెందిన ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసినట్టు తెలిసింది. మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత పీలా శ్రీనివాసరావు మొదటిసారి ముఖ్యమంత్రిని అమరావతిలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. డిప్యూటీ మేయర్ పదవికి ఈ నెల 19న ఎన్నిక జరగనుండడం.. ఆ పదవిని ... మిగతా 6వ పేజీలో



నగర అభివృద్ధికి సహకరించండి

- సీఎం చంద్రబాబుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి

....వివరాలు 6వ పేజీలో

చంద్రబాబుతో మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు. చిత్రంలో ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, తదితరులు ఉన్నారు

మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.6,100 కోట్ల ప్రైవేటు రుణం

మిగిలిన మొత్తం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాల్సిందే..



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు గత పదేళ్ల నుంచి ఒక అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కి పడుతోంది. 2014 నుంచే ఈ ప్రాజెక్టుపై కసరత్తులు మొదలయ్యాయి. రాష్ట్ర విభజన హామీల్లో ఒకటైన దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 20 శాతం వ్యయం భరించి, మిగిలిన మొత్తాన్ని రుణాల ద్వారా సేకరించాలని అప్పట్లో అనుకున్నారు. రాష్ట్ర విభజన తరువాత రెండు ప్రభుత్వాలు మారి ఇప్పుడు మూడోది అధికారంలోకి రావడంతో ప్రణాళికలు కూడా దానికి తగ్గట్టుగా మారిపోయాయి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పనిచేసిన 2014-19 కాలంలోనే ఈ ప్రాజెక్టుకు సాయం చేయడానికి ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు ముందుకు వచ్చింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్రాజెక్టును మార్చేసి చివరకు డీపీఆర్‌ను కూడా సమర్పించకుండానే కాలం గడిపేసింది. ఇప్పుడు మళ్లీ సీఎంగా ఉన్న చంద్రబాబు కేంద్రంతో ఉన్న అనుబంధంతో ఈ ప్రాజెక్టుకు వంద శాతం నిధులు సాధిస్తామని ప్రకటించడంతో పాటు ఆ దిశగా కొత్త ప్రణాళికలను రూపొందించారు. మూడు కారిడార్లతో 46.23 కి.మీ. పొడవున నిర్మించే ఈ ప్రాజెక్టుకు నిర్మాణ వ్యయం రూ.11,498 కోట్లు అవుతుందని అంచనాలు రూపొందించారు. దీనికి 99.8 ఎకరాల భూమి ... మిగతా 6వ పేజీలో

పాలీసెట్‌లో విశాఖ విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 2, 8, 26 ర్యాంకులు

మొత్తం 96.11 శాతం మంది ఉత్తీర్ణత



బి.కల్యాణ్‌రామ్, సెకండ్ ర్యాంకర్



సీహెచ్ చోహాన్, 8వ ర్యాంకర్

కంచరపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పాలీసెట్ ఫలితాల్లో విశాఖ జిల్లా 96.11% ఉత్తీర్ణత సాధించింది. ఈ మేరకు జిల్లా విద్యార్థులు పొందిన ఫలితాలను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా పాలీసెట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. నారాయణరావు వెల్లడించారు. ఈ ఏడాది పాలీసెట్‌కు జిల్లాలో 7,421 మంది బాలురు హాజరు కాగా వీరిలో 7,077 మంది (95.36%), బాలికలు 4,944 మంది హాజరవ్వగా 4,807 మంది (97.23%) ఉత్తీర్ణత సాధించారన్నారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు బాలినేని కల్యాణ్‌రామ్ (120/120 మార్కులు) రెండో ర్యాంకు, చింతాడ చోహాన్ (120/120 మార్కులు) 8వ ర్యాంకు సాధించారు. సబ్బవరపు హనీష్ విరాట్ (119/120) సాధించి 26వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు.

తగ్గిన విద్యార్థులతో ఉపాధ్యాయ పోస్టుల్లో కోత



- గత వైసీపీ ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలే కారణం
- తాజా హేతుబద్ధీకరణతో ఉన్నత పాఠశాలల్లో తగ్గిన టీచర్ పోస్టులు

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో నాలుగు వేల మంది విద్యార్థులతో నంబరువన్ స్థానంలో ఉన్న చంద్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 3,235కు పడిపోయింది. దీంతో ఉపాధ్యాయుల సంఖ్య 135 నుంచి 104కు తగ్గింది. ఆరిలోవలోని తోటగరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 1,800 నుంచి 1,400కు పడిపోవడంతో టీచర్లు 65 నుంచి 48కి తగ్గారు.'

గత వైసీపీ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖను పలు రకాలుగా గందరగోళపర్చడం సర్కారు పాఠశాలలపై తీవ్ర ప్రభావం చూపింది. జీవో నంబర్-117 అమలు, ఉపాధ్యాయులపై అనేక రకాలుగా యాప్‌ల భారం మోపడం వంటి వాటితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు విద్యార్థులు తగ్గారు. అదే సమయంలో ప్రైవేటు స్కూళ్లలో మాత్రం పెరుగుతూ వస్తున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిన ప్రభావంతో ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను తగ్గించారు. తాజాగా ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ అమలు చేయడంతో జిల్లాలో పలు ఉన్నత పాఠశాలల్లో టీచర్ పోస్టులు తగ్గిపోయాయి. జిల్లాల విభజన తరువాత విశాఖ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులు ఏటేటా తగ్గుతూ వస్తున్నారు. జిల్లాల విభజన తరువాత 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో 86,320 మంది విద్యార్థులు చదువుకోగా 2023-24లో 79,952, 2024-25లో 74,416 మందికి తగ్గిపోయారు. అదే సమయంలో ప్రైవేటు స్కూళ్లలో 2022-23లో 2,68,910 మంది చదువుకోగా 2023-24లో ఆ సంఖ్య 2,96,961కు పెరిగింది. అయితే 2024-25లో 2,70,177 మందికి తగ్గడం గమనార్హం. పాఠశాలలను విభజించడం, టీచర్లపై పలు రకాల భారాల మోపడంతో బోధనపై ఆ ప్రభావం తీవ్రగా ... మిగతా 6వ పేజీలో



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, మే 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం వైభవంగా జరిగింది. వేకువ జామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూ, నీలాదేవి సమేతంగా పలు స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్ర నామాలతో సంకల్పించి విశ్వక్సేనారాదన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

18న జాబ్‌మేళా

ఎండాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక బీఆర్ అంబేడ్కర్ పీపుల్స్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో యాక్ట్ డిగ్రీ కళాశాలలో జేసీఐ సహకారంతో ఈనెల 18న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు కళాశాల చైర్మన్ బి. రాజారావు, సెక్రటరీ జేవీ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఎస్. జంగాలయ్య తెలిపారు. బుధవారం వారు ఆ కళాశాల ఆవరణలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 20 కంపెనీలకు పైగా జాబ్ మేళాకు హాజరై నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. ఆసక్తి గల యువత ప్రిన్సిపాల్ ఎం. పద్మారావును కలిసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై గీతంలో ఎఫ్‌డీపీ

సాగర్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జీ కమ్యూనికేషన్ల స్కిల్స్‌పై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజి ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం (ఎఫ్‌డీపీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగం ప్రొఫెసర్ శ్రీహరిరావు మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్, 6జీ కమ్యూనికేషన్‌లో అధ్యాపకులు నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, ఈసీఈ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణీ చంద్రకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డులో సమస్యలపై వినతి

భీమునిపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3వ వార్డు అభివృద్ధికి సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, మేయరు పీలా శ్రీనివాస్‌ను కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ వార్డులో పెండింగ్‌లో వున్న పనులకునిధులు మంజూరు చేయాలన్నారు.

బంగారమ్మ చదురు గుడికి రంగులు

పద్మనాభం, మే 14 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో బంగారమ్మ అమ్మవారి పండగ నేపథ్యంలో నూతనంగా నిర్మించిన అమ్మవారి చదురు గుడికి దాత సహాయంతో బుధవారం రంగులు వేయించారు. గ్రామానికి చెందిన బుగత రవికుమార్ మందిరం మొత్తానికి అందులోని విగ్రహాలకు తన సొంత నిధులతో రంగులు వేయించి, గుడిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు కాగా పండగకు ఈనెల 17న చాటింపు వేయిస్తారు. 25న దేవర ఉత్సవంతో పండగ ప్రారంభవుతుంది. జూన్ 2న తొలేళ్ల ఉత్సవం, 3న అనుపోత్సవం, 4న కనుమ జరగనుంది.

తగ్గిన విద్యార్థులతో ఉపాధ్యాయ పోస్టుల్లో కోత

... 5వ పేజీ తరువాయి

చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి విద్యా సంవత్సరంలో వైసీపీ హయాంలో చేపట్టిన సంస్కరణలనే అమలు చేయడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. తాజాగా జారీ చేసిన జీవో నంబర్-21 మేరకు ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వుల మేరకు జిల్లాలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి మేరకు టీచర్లను కేటాయించారు. జిల్లాలో ప్రధానంగా చంద్రంపాలెం, తోటగరువు, గాజువాక, నడుపూరు, ఆనందపురం, తదితర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రాథమిక పాఠశాలల విషయంలో కొత్తగా అమలు చేసిన మోడల్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 3, 4, 5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన ప్రభావం మొత్తం ప్రాథమిక పాఠశాలలపై పడింది. అనేక ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో జిల్లాలో పలుచోట్ల పాఠశాలల్లో పది మంది కంటే తక్కువకు విద్యార్థుల సంఖ్య పడిపోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా అమలు చేసిన సంస్కరణల మేరకు ప్రాథమిక పాఠశాలలపై ఫోకస్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

యూనిటీ మాల్ నగరానికి మైలురాయి

▸ రూ. 172 కోట్లతో మాల్ నిర్మాణం ▸ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఎండాడ/సాగర్‌నగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులోని రాయానాయుడు స్టూడియో ప్రాంతంలో నిర్మించనున్న యూనిటీ మాల్ నగరానికి మైలు రాయిగా నిలుస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ఐదు ఎకరాల్లో రూ. 172 కోట్లతో నిర్మించనున్న ఈ మాల్ స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదు అంతస్తుల్లో డిజైన్ చేసిన యూనిటీ మాల్‌లో కన్వెన్షన్ సెంటర్, మినీ థియేటర్లు, 62 రిటైల్ స్టోర్స్ ఫిట్నెస్ సెంటర్ వంటివి ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కొండవాలు ప్రాంతంలో కేటాయించిన ఈ స్థలానికి కల్పించిన రోడ్డు సదుపాయం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే ఇదే ప్రాంతంలో ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌కు కేటాయించిన ఐదు ఎకరాల భూమిని కూడా సందర్శించారు. వచ్చే ఏడాది జూన్ నాటికి భోగాపురం గ్రీన్ ఫీల్డ్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు అందుబాటులోకి రానున్న నేపథ్యంలో కొత్తగా హోటళ్లు, రిసార్ట్స్ క్లబ్‌లు రావాల్సిన ఆవశ్యకత ఉందని గంటా పేర్కొన్నారు. ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్‌కు శాశ్వత భవనం కావాలన్న ప్రతినిధుల విజ్ఞప్తిమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలోనే ఈ భూమిని కేటాయించారని వివరించారు. సాంకేతిక అంశాలు పరిష్కారం కాగానే కల్చరల్ సెంటర్ పనులకు శ్రీకారం చుట్టే అవకాశం ఉందని తెలిపారు. అనంతరం ఎండాడ మహిళా పోలీసు స్టేషన్ పక్కన కాపు భవనానికి కేటాయించిన స్థలాన్ని కూడా గంటా పరిశీలించారు. అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ భవనం ప్రతిపాదన సాధ్యమైనంత త్వరగా కార్యరూపం దాల్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ హయంలో కాపు భవనానికి కేటాయంచిన ఎకరా భూమి విస్తీర్ణాన్ని వైసీపీ ప్రభుత్వం 50 సెంట్లకు తగ్గించిందన్నారు. రూ 6 కోట్లతో ఈ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారని, త్వరలో నిధులు మంజూరు చేయించి, పనులు ప్రారంభమయ్యేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ కె. సంగీత్ మాదుర్, కార్పొరేటర్ లొడగల అప్పారావు, కూటమి నాయకులు శేఖర్ శ్రీనివాస్, సారిపిల్లి శ్రీనివాస్, చెట్టుపల్లి సన్యాశిరావు, ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణం గురించి అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

లారీ యజమానుల నిరసన

తగరపువలస, మే 14 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారి మీదుగా అధిక ఇసుక లోడుతో వెళుతున్న లారీలను భీమిలి మండల లారీల యజమానుల సంఘం ప్రతినిధులు బుధవారం ఉదయం అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఇసుక లారీలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో సీఐ బి. తిరుమలరావు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పారు సుమారు నాలుగు గంటల పాటు ఈ గొడవ జరిగింది. ఆరు టైర్లున్న లారీలపై 10 టన్నుల ఇసుక, 12 టైర్ల లారీలు (టారస్)లపై 20 టన్నుల ఇసుక రవాణా చేయడానికి అవకాశం ఉంది. అంతకన్నా ఎక్కువ లోడు వేసిన లారీలపై స్థానిక అధికారులు ఎప్పటికప్పుడు కేసులు రాస్తున్నారు. అయితే బుధవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా నారాయణపురం ఇసుక ర్యాంపు నుంచి 60 టన్నులపైగా బరువున్న ఇసుకను జాతీయ రహదారిపై రవాణా చేస్తున్న నాలుగు లారీలను స్థానిక లారీల యజమానుల సంఘం అధ్యక్షుడు పి. రమణ ఆధ్వర్యంలో డ్రైవర్లు అడ్డుకున్నారు. తమపై కేసులు పెడుతున్న అధికారులు వాటిని ఎలా అనుమతిస్తున్నారని, ఈ విషయం తేల్చేంతవరకు లారీలను కదలనిచ్చేది లేదని అడ్డగించారు.



తగరపువలస జాతీయ రహదారిపై లారీల యజమానుల నిరసన

దీంతో సీఐ తిరుమలరావు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమస్యను ట్రాన్స్‌పోర్టు అధికారులు పరిష్కరించాలని, లారీలను నిలుపుదల చేయడం సరికాదని చెప్పారు. దీంతో యజమానులు ఆపిన లారీలను విడిచిపెట్టారు. కాగా ఈ సమస్యపై ట్రాన్స్‌పోర్టు అధికారులకు లేఖ పంపామని లారీ యజమానుల సంఘం భీమిలి మండల అధ్యక్షుడు రమణ తెలిపారు. అన్ని లారీలకు ఒకే నిబంధన వర్తింపజేయాలని, కొన్ని లారీలకు ఒకలా భీమిలి మండలంలో లారీలకు ఒకలా వర్తింపజేయరాదని లేఖలో కోరినట్టు తెలిపారు.



గోస్తనీ సాగర సంగంలో శ్రీవారికి చక్ర స్నానం

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు



భీమునిపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం రాత్రితో ముగిసాయి. ఈనెల 9వ తేదీ నుంచి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి శ్రీవారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో ఘనంగా ఊరేగించారు. బుధవారం నిత్య పూజలు, అర్చలు, హోమాలు, ధ్వజారోహణం, గరుడ ప్రసాద వితరణ చేపట్టారు. అనంతరం, కొట్నాల ఉత్సవం, వసంతోత్సవం, శ్రీవారి ధృవమూర్తికి నవకలశ స్నపనం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయంలో అన్నకూటోత్సవం జరిగింది. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గోస్తనీ, సాగర సంగం తీరానికి తీసుకువెళ్లి చక్రస్నానం నిర్వహించారు. అలాగే శ్రీపుష్ప యాగం, కృష్ణ కూచిపూడి నృత్యా నిలయం కృష్ణవేణి ఈశ్వర్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రధానార్చకుడు పురాణం శేషాచార్యులు,శిష్య బృందం ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీలు కలిగొట్ల సూర్యనారాయణమూర్తి, కె. శ్రీరామచంద్రమూర్తి, కేవీ భానోజీరావు, కె. శ్రీనివాసరావు, ఆలయ సంఘం కోశాధికారి పుశిరికల బంగారాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కొమ్మాది, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డులోని పీఎంపాలెంలో బీజేపీ నాయకులు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేఎస్‌పీ చక్రవర్తి, రాజు, సత్యసాయి, కోస్ట్ రఘు, నాగేశ్వరరావు, గౌరి, అప్పలరాజు, నారాయణరావు, దేముడు, కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజెండాలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా మెగా క్లీనింగ్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు. మసీదులు, పార్కులు, బస్, రైల్వేస్టేషన్లు, వసతి గృహాలు, ఆస్పత్రులు, తదితర ప్రాంతాల్లో ప్రతి మూడో శనివారం పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సీపీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. టెర్రస్ గార్డెన్, తడి, పొడి చెత్త సేకరణ, ప్రజా మరుగుదొడ్ల వినియోగంపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

భూసార పరీక్షలు తప్పనిసరి : ఏఓ

పద్మనాభం, మే 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు తమ పొలాల్లో తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎంవీఎస్ చలం చెప్పారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. భూసార పరీక్షల కోసం వ్యవసాయ సహాయకులు రైతుల పొలాల్లోకి వచ్చి మట్టి నమూనాలు సేకరిస్తారన్నారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్షల కేంద్రానికి పంపిస్తామని, భూసార కార్డుల ద్వారా మట్టి నమూనా ఫలితాలను రైతులకు తెలియజేస్తామన్నారు. ఆ నివేదికను అనుసరించి రైతులు తమ పొలాలకు అవసరమైన ఎరువులు వినియోగించాలని చెప్పారు. ప్రస్తుతం 118 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు రైతు సేవా కేంద్రాల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. 50 శాతం రాయితీపై జీలుగు, జనుము, పిల్లి పెసర విత్తనాలు సరఫరా చేస్తామన్నారు. అన్నదాత సుఖీభవ పథకంలో చేరడానికి రైతులు తమ 1బి కాపీని, ఆధార్‌కార్డు తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాలు నమోదు చేసుకున్నవారికి మాత్రమే ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం నగదును వారి ఖాతాల్లో వేస్తుందన్నారు.

పాలీసెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ

రాజమహేంద్రవరం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాల్లో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఉన్న తిరుమల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకు 120 మార్కులను ఆరుగురు విద్యార్థులు పొందారు. బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ ఈ ఘనత సాధించారు. 119 మార్కులు 13 మంది సాధించినట్టు విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతో పాటు 50 లోపు 14 మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79 మంది ర్యాంకులు సాధించారన్నారు.విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తులంన్నర బంగారం అపహరణ

సీతంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మారికవలసకు చెందిన రోహిణి అనే మహిళ నగరంలోని ఓ నగల దుకాణంలో బుధవారం తులంన్నర బంగారం కొనుగోలు చేసి ఆటో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో ఓ మహిళ కూర్చుని ఉంది. ఇద్దరూ ప్రయాణించిన తరువాత డైమండ్ పార్క్ దగ్గరకు వచ్చేసరికి ఆ మహిళ ఆటో నుంచి దిగిపోయింది. రోహిణి మరికొంత దూరం వెళ్లి పర్సు చూసుకోగా కొనుగోలు చేసిన తులంన్నర బంగారం కనిపించలేదు. ఉలిక్కిపడి లబోదిబోమంటూ ఆమె నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.6,100 కోట్ల ప్రైవేటు రుణం

... 5వ పేజీ తరువాయి

అవసరం అవుతుందని, ప్రైవేటు భూములకు చెల్లించడానికి రూ.882 కోట్లు కావాల్సి ఉంటుందని లెక్కలు వేశారు. ఢిల్లీ వెళ్లినపుడల్లా దీనిపై చర్చలు జరిపారు. అక్కడ ఏమైందో తెలియదు గానీ తాజాగా మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి బుధవారం అమరావతిలో ప్రైవేటు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి విశాఖతో పాటు అమరావతి మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు తక్కువ వడ్డీతో రుణ సాయం చేయాలని కోరారు. విశాఖ ప్రాజెక్ట్‌కు రూ.6,100 కోట్లు రుణంగా అవసరం అవుతుందని ప్రతిపాదించారు. ఈ సమావేశానికి ఏడీబీతో పాటు ఇంకా అనేక బ్యాంకులు హాజరయ్యాయి. పీపీపీ విధానంలో ప్రైవేటు బ్యాంకులు రూ.6,100 కోట్లు సమకూరిస్తే మిగిలిన మొత్తం రూ.5,398 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. ఇది కాకుండా భూ సేకరణకు అవసరమైన మొత్తం రూ.882 కోట్లు ప్రభుత్వం సమకూర్చుకోవాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పట్టాలపైకి వస్తుంది.

నేటి నుంచి ఏడు అదనపు బస్సు సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా కాంప్లెక్సు నుంచి దూర ప్రాంతాలకు 3, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు 4 అదనపు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. విశాఖ నుంచి అమలాపురానికి ప్రతి 40 నిమిషాలకు ఒక షెడ్యూల్ బస్సు ఉంది.కానీ ఈ రూట్‌లో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఉదయం 8.45 గంటలకు మరో అదనపు సర్వీసు నడపనున్నారు. ద్వారకాబస్‌స్టేషన్ నుంచి కాకినాడకు ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా ఉదయం 5.15 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు అదనపు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే నగరంలోని గాజువాక, ద్వారకాబస్‌స్టేషన్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు నాలుగు అదనపు బస్సులు నడపనున్నారు. గురువారం నుంచి అదనపు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు.

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై కీలక నిర్ణయం

ఏయూ నుంచి వెనక్కి పంపేందుకు లేఖ రాస్తానన్న వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం,మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చి ఫ్యాకల్టీగా కొనసాగుతుండడంపై గడిచిన కొన్నేళ్ల నుంచి రచ్చ జరుగుతోంది. ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలంటూ వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర అధికారులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఏయూ అధికారులకు కూడా కాలేజీయేట్ కమిషనర్ నుంచి మూడుసార్లు లేఖలు కూడా వచ్చినట్టు చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీని కొనసాగిస్తారా.. వెనక్కి పంపిస్తారా.? అని వచ్చిన లేఖలపై వర్సిటీ అధికారులు ఇప్పటివరకు సమాధానం కూడా చెప్పలేదు. కాలేజీయేట్ కమిషనర్ నుంచి ఏయూ అధికారులకు వచ్చిన లేఖల విషయాన్ని కొందరు వీసీ జీపీ రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లడంతో బుధవారం ఆయన కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీలోని వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, డీన్లతో నిర్వహించిన సమావేశంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీని ఏంచేద్దామని ప్రశ్నించారు. దీనిపై వారంతా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపాలన్న అభిప్రాయాన్ని దాదాపు అందరూ వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై వీసీ స్పందిస్తూ వారిని వెనక్కి పంపించేలా లెటర్ రాస్తానని చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆయన లేఖ రాసే అవకాశం ఉంది. ఇదిలావుండగా కాలేజీయేట్ కమిషనర్ నుంచి వచ్చిన లేఖల విషయాన్ని తనకు చెప్పకపోవడంపైనా వీసీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. తనకు తెలియకపోవడం వల్లే దీనిపై నిర్ణయం తీసుకోలేకపోయానని ఆయన చెప్పినట్టు పలువురు చెబుతున్నారు. అయితే ఒక సీనియర్ ప్రొఫెసర్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లడం వల్లే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదిఏమైనా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపేందుకు వీసీ నిర్ణయం తీసుకోవడంతో ఏయూ అధ్యాపకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నగర అభివృద్ధికి సహకరించండి

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) :నగర అభివృద్ధికి సహకరించవలసిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మేయర్‌గా ఎన్నికైన తరువాత తొలిసారిగా ఆయన బుధవారం అమరావతిలో సీఎంను పలువురు ప్రజాప్రతినిధులు, నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావును చంద్రబాబునాయుడు అభినందించారు. గత మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతో పాటు అవిశ్వాసం నెగ్గేలా చేయడానికి కృషి చేసిన మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంపీలు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లను సీఎం అభినందించారు. మేయర్‌గా నగరాభివృద్ధికి కృషి చేయాలని పీలాకు సూచించారు. కార్పొరేటర్లు, కూటమి ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ పాలన సాగించాలన్నారు. మేయర్ బాధ్యతలు చేపట్టాక ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణపై విశేషంగా కృషి చేస్తున్నారంటూ పీలా శ్రీనివాస్‌ను అభినందించారు. చంద్రబాబును కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి దామచర్ల సత్య, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఎండాడ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ సబ్‌స్టేషన్ పరిధిలోని వీవీ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేయనున్నట్టు జోన్-3 ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ప్రకటన విడుదల చేశారు.



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) రేవతి (ఫైల్‌ఫొటో)

వైద్యం వికటించి వివాహిత మృతి

ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రి ఎదుట మృతురాలి కుటుంబీకుల ధర్నా

తగరపువలస, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఆర్‌ఐ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఎర్రంశెట్టి రేవతి (22) అనే వివాహితి మృతి చెందింది. ఈమేరకు మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు బుధవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. చిట్టివలస బొగ్గు రోడ్డు ప్రాంతంలో నివాసం ఉంటున్న రేవతి ఈనెల 9న బాత్ రూమ్‌లో జారి పడిపోవడంతో చెయ్యి విరిగిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు చికిత్స మొదలు పెట్టిన తర్వాత ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఐసీయూలో ఉంచారు. దీంతో ఆమె భర్త జనార్దనరావు ఆస్పత్రి వర్గీయులతో గొడవకు దిగారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆరిలోవ అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం రేవతి మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి ముఖద్వారం ఎదుట ధర్నాకు దిగారు. చికిత్స చేసిన వైద్యులపై చర్యలు తీసుకునేవరకు తాము ఇక్కడి నుంచి కదలమని భీష్మించుకు కూర్చున్నారు. భీమిలి పోలీసులు ధర్నా వద్దకు వచ్చి ఇరువర్గాల మధ్య చర్చలు జరుపుతున్నారు. సీఐ తిరుమలరావు ధర్నాను పర్యవేక్షిస్తున్నారు.

కేజీహెచ్‌లో తాగునీటి కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీంతో బాత్రూమ్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోందని, అక్కడ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న రోగి సహాయకుడు నాయుడు తెలిపారు. ఆస్పత్రిలో తాగునీరు లభ్యం కాకపోవడంతో రెండు రోజుల నుంచి బయటి వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నా మని, నీటి సమస్య వేసవిలో ఉత్పన్నమవుతుందని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని డి.వెంకటరావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. కాగా కార్డియాలజీ విభాగం వద్దనున్న ఆర్వో ప్లాంట్ వద్ద నీరు రాకపోవడం మాట పక్కన పెడితే దానిని ముట్టుకుంటేనే కరెంట్ షాక్ కొడుతుందని పలువురు రోగుల సహాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి నీటి ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రోగులతో పాటు వారి సహాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరఫరా ఏదీ?

కేజీహెచ్‌లోని వార్డులు, నర్సింగ్ కాలేజీ, హాస్టళ్లతో పాటు అధికారుల చాంబర్స్‌కు అవసరమయ్యే నీటిని జీవీఎంసీ సరఫరా చేస్తుంది. రోజువారీ అవసరాల కోసం కేజీహెచ్‌కు 500 నుంచి 600 కిలోలీటర్ల నీరు అవసరం అవుతుంది. ఈ నీటి సరఫరా కోసం కేజీహెచ్‌లో ఐదుచోట్ల నీటిని నిల్వ చేసే సంపులు ఉన్నాయి. ఈ సంపులకు రెండు మార్గాల ద్వారా జీవీఎంసీ నీటిని సరఫరా చేస్తుంది. ఈ మేరకు నీటిని సరఫరా చేయకపోవడం వల్లే సమస్యలు ఎదురవుతున్నట్టు పలువురు పేర్కొంటున్నారు.

డిప్యూటీ మేయర్ ఎంపిక నిర్ణయం మీదే..

... 5వ పేజీ తరువాయి

పలువురు ఆశిస్తుండడంతో దీనిపై కూడా సీఎం చంద్రబాబుతో చర్చించేందుకు నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పి. విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, తదితరులు అమరావతి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు.

ఈ సందర్భంగా ఆయన వద్ద డిప్యూటీ మేయర్ పోస్టుకు పలువురు పోటీ పడుతున్నారని, యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన కూటమి కార్పొరేటర్ల నుంచి తీవ్రమైన పోటీ నెలకొన్నట్టు మేయర్, ప్రజాప్రతినిధులు వివరించారు. 'వీరిలో ఎవ రిని ఎంపిక చేస్తారో నిర్ణయం మీదే' అని చంద్రబాబుకు చెప్పగా.. అందుకు ఆయన స్పందిస్తూ స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని, కూటమి పార్టీలకు నష్టం వాటిళ్లకుండా, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేలా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలంతా కూర్చుని ఏకాభిప్రాయంతో డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలని సూచించినట్టు తెలిసింది. దీంతో డిప్యూటీ మేయర్ ఎంపిక మళ్లీ నగర ప్రజాప్రతినిధుల కోర్టులోకి వచ్చినట్టయింది. దీంతో సీఎం సమక్షంలో డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై పంచాయితీ తేలిపోతుందని భావించిన ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది.

22వ వార్డులో అసంపూర్తిగా అభివృద్ధి పనులు

» రూ.2.70 కోట్ల పనులకు బ్రేక్ » పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు » పాత భవనాలు లేక.. కొత్తవి నిర్మాణం కాకపోవడంతో స్థానికుల అసంతృప్తి



గోతులు తవ్వి ఆపేసిన బలరాంనగర్ కల్యాణమండపం

మద్దిలపాలెం, మే 5 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో అభివృద్ధి పనులకు బ్రేకులు పడ్డాయి. దాదాపు రూ.2.70 కోట్ల పనులు నిలిచిపోయాయి. వార్డులోని పిఠాపురం కాలనీలో రూ.1.68 లక్షలతో జీవీఎంసీ షాపింగ్ కాంప్లెక్స్, బలరాంనగర్‌లో రూ.50 లక్షలతో కల్యాణ మండపం, సచివాలయం, మంగాపురం కాలనీలో రూ. 20 లక్షలతో సామాజిక భవనం, పీతలవానిపాలెంలో రూ.32 లక్షలతో గెడ్డ రిటైనింగ్ వాల్ నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. ఆయా పనుల కోసం పాత నిర్మాణాలను తొలగించి నూతన నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. కానీ ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

పిఠాపురంకాలనీ కళాభారతి పక్కన జీవీఎంసీ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో రూ.1.68 కోట్లతో నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి జీవీఎంసీ నిధులు మంజూరు చేసింది. దీంతో పాత భవనంలో ఉన్న రెండు సచివాలయాలు, పోస్టాఫీసు, వార్డు కార్యాలయం ఖాళీ చేశారు. రెండు అంతస్తుల్లో సచివాలయాలు, ఆఆస్పత్రి, దుకాణాల సముదాయం నిర్మాణం చేయడానికి ప్రణాళిక రూపొందించారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు ఏప్రిల్ 3న శంకుస్థాపన చేశారు. ఎనిమిది నెలల్లో భవనం నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. మరుసటి రోజే పాత భవనం కూలగొట్టి స్థలం చదును చేశారు. పక్కనే ఉన్న పార్కు స్థలం ఆక్రమించుకుని భవనం విస్తరించాలని ప్రయత్నించారు. దీంతో కాలనీ వాసులు హైకోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి.

అసంపూర్తిగా సామాజిక భవనం

మంగాపురం కాలనీ సామాజిక భవనంలో అంగన్వాడీ కేంద్రం ఉండేది. ఇదే భవనంలో స్థానికులు గ్రామ సమావేశాలు, శుభ కార్యాలు నిర్వహించుకునేవారు. దీన్ని విస్తరించి రెండు అంతస్తులు నిర్మాణం చేయడానికి రూ.20 లక్షలు నిధులతో పనులు ప్రారంభించారు. ఉన్న భవనం కూలగొట్టి మొదటి శ్లాబ్ నిర్మించారు. అక్కడితో పనులు ఆపేశారు. ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకూ ఈ పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికులకు భవనం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పనులే మొదలవ్వని కల్యాణ మండపం...

బలరాంనగర్ సచివాలయ భవనాన్ని విస్తరించి కళ్యాణమండపం, సామాజిక భవనం, సచివాలయం నిర్మాణానికి జీవీఎంసీ రూ.50 లక్షలు మంజూరుచేసింది. దీంతో పాత సచివాలయం ఖాళీ చేయించి నూతన భవనానికి శంకుస్థాపన చేసి గోతులు తీశారు. ఆరు నెలల గడుస్తున్నా గోతులు దాటి పనులు ముందుకు వెళ్లలేదు. అక్కడితో పనులు ఆపేసి చేతులు దులుపుకున్నారు. అలాగే పీతలవానిపాలెం గెడ్డలో రూ.32 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. గెడ్డలో ఇనుప చువ్వలు ఏర్పాటు చేసిన పనులు నిలిపివేశారు.

ఇలా 22వ వార్డులో సుమారు రూ.2.70 కోట్ల అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. కనీసం పాత భవనాలు ఉన్న వినియోగించుకునేవాళ్లం, కొత్త భవనాలు నిర్మాణం చేస్తామని ఉన్నవి కూలగొట్టారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిలిచి పోయిన అభివృద్ధి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



శ్లాబుతో నిలిచిపోయిన మంగాపురం కాలనీలోని సామాజిక భవనం

సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



చిరు వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం సూపర్‌వైజర్ నమ్మి చిన్నరాజు తదితరులు

వెంకోజీపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎం.హరేంధరప్రసాద్ ఆదేశాల మేరకు సీఎంవోహెచ్ నరేష్, జోనల్ కమిషనర్ శివ ప్రసాద్ సూచనలతో సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై 16వ వార్డులో దుకాణ దారులకు బుధవారం అవగాహన కల్పించారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు, శుభ్రం సూపర్‌వైజర్ నమ్మి చిన్నరాజు, సచివాలయం సిబ్బంది హెచ్‌బీ కాలనీ నుంచి కృష్ణా కళాశాల వరకు ఉన్న టిఫిన్ సెంటర్లు, దుకాణ దారులకు సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించడంతో పాటు అనధికారంగా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్న వారికి జరిమానా కూడా విధించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలను వ్యాపారులకు వివరించారు. జీవీఎంసీ అనుమతి కల్పించిన కవర్లను మాత్రమే వాడాలని సూచించారు.

నేడు జోన్-3 కార్యాలయంలో ప్రత్యేక సమావేశం

» నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులకు ఆహ్వానం

వెంకోజీపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీలో ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం నేపథ్యంలో తూర్పు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పునఃరూపకల్పన చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించేందుకు గురువారం సమావేశం నిర్వహించనున్నట్టు జోన్-3 కమిషనర్ శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అశీలుమెట్ట జోన్-3 కార్యాలయంలోని సమావేశ మందిరంలో గురువారం సాయంత్రం 3వ జోన్‌కు సంబంధించి ప్రజా ప్రతినిధులు, నివాసిత సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన పౌరుల సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్టు తెలిపారు. ఈ సమావేశానికి అధిక శాతం మంది హాజరు కావాలని కోరారు.

జోన్-2లో..

, మే 14 (ఆంధ్రజ్యోతి) : మహావిశాఖ నగర పాలక సంస్థలో ప్రస్తుతం ఉన్న ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలనా సౌలభ్యం కోసం పలు కీలక అంశాలపై చర్చించేందుకు గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు జోన్-2 ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీరామ్ తెలిపారు. అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలో పునర్ రూప కల్పన చేయడం, పాలనపరంగా తగిన ప్రతిపాదనలు రూపొందించడంపై ఈ సమావేశంలో చర్చించనున్నట్టు చెప్పారు. 9 నుంచి 13 వార్డుల్లో భాగస్వామ్యులైన ప్రజా ప్రతినిధులు, రెసిడెంట్స్ అసోషియేషన్ల ప్రతినిధులు, వివిధ రంగాలలో అనుభవజ్ఞులైన పౌరులు, మేధావులు పాల్గొనాలని కోరారు. సమావేశానికి వారు విచ్చేసి సలహాలు. సూచనలు అందించవచ్చని తెలిపారు. మధురవాడ జోన్-2 కార్యాలయంలో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశానికి ఆయా వర్గాల ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 34, కంద 84, దేముడు చిక్కుడు 34, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 30, కర్ర పెండలం 18, మామిడి అల్లం 56, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆరిలోవ, మే14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి పదో తరగతి అడ్వాన్డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వీటితో పాటు ఓపెన్ స్కూలు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రెగ్యులర్ వారికి జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు జరుగుతాయని తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24వ తేదీవరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్షలు జరుగుతాయని ఓపెన్ స్కూలు సొసైటీ సంచాలకులు నరసింహారావు తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి 12-30 వరకు జరుగుతాయని తెలిపారు. 9 కేంద్రా ల్లో నిర్వహించనున్న ఓపెనప్ టెన్త్ పరీక్షలకు 640 మంది విద్యార్థులు, 5 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 814 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.

ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

» అఖిలపక్ష కార్మిక సంఘ నేతల డిమాండ్

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ పేరుతో ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్, షోకాజు నోటీసులు ఇచ్చిన యాజమాన్యం వీటిని తక్షణమే విరమించుకోవాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు షోకాజు నోటీసులు, సస్పెన్షన్ ఇవ్వడాన్నినిరసిస్తూ బుధవారం ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం మార్గంలో ధర్నా నిర్వహించారు.కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ప్లాంటు యాజమాన్యం వైఖరిని తప్పుపట్టారు.

ఉత్తమ క్రీడాకారులను తీర్చిదిద్దే బాధ్యత కోచ్‌లదే

» భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



క్రీడాకారులకు కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికి తీసి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. సమ్మర్ కోచింగ్ క్యాంపుల్లో పాల్గొనే కోచ్‌లకు ఎంవీపీ కాలనీలోని తన నివాసంలో గంటా శ్రీనివాసరావు బుధవారం స్పోర్ట్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం గర్వించే విధంగా క్రీడాకారులను తయారు చేసే బాధ్యత కోచ్‌లు తీసుకోవాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పద్మనాభంలో వాలీబాల్, రుషికొండలో వాటర్ స్పోర్ట్స్, కొమ్మాది, బక్కన్నపాలెంలో ఫుట్‌బాల్, రేవిడిలో హ్యాండ్‌బాల్, కొమ్మాదిలో బాక్సింగ్, మధురవాడలో స్కేటింగ్ కోచింగ్ క్యాంపులను నిర్వహిస్తున్నట్టు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ జాన్ గాలియట్ గంటాకు వివరించారు. అథ్లెటిక్ కోచ్ వైకుంఠరావు, పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

అఖిల భారత సమ్మె విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ముఠా కార్మిక సంఘం కార్యదర్శి సుబ్బారావు

మద్దిలపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈ నెల 20న చేపట్టబోయే అఖిలభారత సమ్మెను విజయవంతం చేయాలని ముఠా కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బారావు పిలుపునిచ్చారు. మద్దిలపాలెంలో బుధవారం నిర్వహించిన ముఠాకార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికులైన ముఠా కార్మికులకు రక్షణ లేదన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అమలు చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యజమానులకు అనుకూలంగా నాలుగు లేబర్‌కోడ్స్ తీసుకొచ్చాయన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలైతే కార్మికులకు ఉన్న కొద్దిపాటి హక్కులు పోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ముఠా కార్మికులకు పనులు లేక ఆదాయం పోవడమే కాకుండా ప్రమాదాలు కలిగిన రక్షణ లేకుండా పోతుందన్నారు. ముఠా కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐతో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు వారు గర్వించదగిన జ్ఞాని 'కొమర్రాజు'

» పుస్తకావిష్కరణ సభలో వక్తల ప్రశంస



గ్రంథావిష్కరణలో పాల్గొన్న ఆచార్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బాలమోహన్‌దాస్, వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివరావు తదితరులు

సిరిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఒక్కతరంలోనే పది తరాలకు సరిపడా ప్రగతిని తెలుగువారికి అందించిన వైతాళికుడు కొమర్రాజు వేంకట లక్ష్మణరావు అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం ఆంధ్ర విశ్వ కళా పరిషత్ హిందీ భవన్ హాలులోని లోక్‌నాయక్ ఫౌండేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు వేంకట లక్ష్మణరావు జీవిత సాహిత్యంపై రచయితలు ఆచార్య వెలమల సిమ్మన్న, డాక్టర్ గుమ్మా సాంబశివరావు గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రంథావిష్కరణను కేంద్ర హిందీ అకాడమీ సభ్యులు, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చేయగా, గౌరవ అతిథిగా ఆచార్య వి.బాలమోహన్‌దాస్‌కు తొలి గ్రంథాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపసాద్ మాట్లాడుతూ తెలుగు వారంతా గర్వించదగిన మహావ్యక్తి కొమర్రాజు అన్నారు. విజ్ఞాన సర్వస్వమంటే తెలియని రోజుల్లో ఆ దిశగా ఆలోచించి తెలుగువారికి అపూర్వ గ్రంథాలను అందించి కానుకలను ఇచ్చారన్నారు. కొమర్రాజుపై రచయితలు సిమ్మన్న, సాంబశివరావులు గొప్పగ్రంథం రాశారని కొనియాడారు.

అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ రచయితలు ఇద్దరూ బహుగ్రంథ కర్తలన్నారు. వారి సాహిత్య కృషిని ప్రోత్సాహించేలా యార్లగడ్డ ముందుకు వచ్చి అండగా నిలవడం అభినందనీయమన్నారు. గ్రంథ సమీక్ష డాక్టర్ దామెర వెంకటసూర్యారావు మాట్లాడుతూ కొమర్రాజు రచనలను సేకరించి విమర్శనాత్మక దృక్పథంతో ఆయన చరిత్ర గ్రంథాలు, శాస్త్ర రచనలను విశ్లేషించి భావితరాలకు ఉపయోగకరంగా గ్రంథం తీసుకొచ్చారన్నారు. విశిష్ట అతిథి ఆచార్య కొమర్రాజు రవి మాట్లాడుతూ తమ కటుంబ విశేషాలను తెలియజేశారు. ఈ పుస్తకాన్ని తీసుకొచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రచయితలను యార్లగడ్డ సత్కరించారు. కార్యక్రమంలో ఆచార్య జర్రా అప్పారావు, లోక్ నాయక్ ఫౌండేషన్ కార్యదర్శి ఆచార్య నల్లా బాబయ్య, ఏయూలోని పలు విభాగాలకు చెందిన ఆచార్యులు, సాహితీప్రముఖులు, రచయితలు, కవులు పాల్గొన్నారు.

కాలువలపై సిమెంటు పలకలు ఏర్పాటు చేయరూ..



విరిగిన పలకలతో ఉన్న ప్రధాన కాలువ

ఆరిలోవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12వ వార్డులో గల పెదగదిలిలో గల ప్రధాన కాలువపై మూతలు విరిగిపోవడంతో పలువురు ప్రమాదాలకు గురవుతున్నారు. కాలువలపై పలకలు లేకపోవడంతో గమనించని కొందరు నడుస్తూ వచ్చి అందులో పడిపోతున్నారని అంటున్నారు. అంతేకాకుండా నిత్యం మురుగు పారే ఈ కాలువలపై పలకలు లేకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోందని అంటున్నారు. మురుగు నీరు కావడంతో దోమలు, ఈగలు ముసురుతున్నాయని, దీనివల్ల ఎప్పుడు ఏ రోగాలు సంక్రమిస్తాయోనన్న భయం కలుగుతోందని అంటున్నారు. అలాగే పెదగదిలిలో గల ప్రధాన కాలువ పూడకతో నిండి పోయి ఉంది. దీంతో మురుగునీరు ప్రవహించక ఎక్కడ నీరు అక్కడ నిలిచిపోయి ఉంది. ఇది ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఫిర్యాదు చేసినా జీవీఎంసీ పారిశుధ్య విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా కాలువలపై సిమెంటు పలకల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పూడిక నిండడంతో మురుగునీరు పారని పెదగదిలి ప్రధాన కాలువ

కేంద్ర కారాగారంలో మళ్లీ సెల్‌ఫోన్ల కలకలం

» డీజీ ఆదేశాలతో తవ్వకాలు చేపట్టగా దొరికిన రెండు ఫోన్లు
» కావేరి బ్యారెక్స్ సమీపంలో రెండు అడుగుల లోతులో లభ్యం
» ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసిన జైలు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు

ఆరిలోవ, మే 14(ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో గల కావేరి బ్యారెక్స్ వద్ద భూమిలో జరిపిన తవ్వకాలలో రెండు సెల్ ఫోన్లు మంగళవారం లభ్యమైనట్లు జైలు అధికారులు తెలిపారు. దీనిపై బుధవారం ఉదయం ఫిర్యాదు అందినట్టు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ ఇటీవల రాజమండ్రిలో జైలు సూపరింటెండెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల కడప కారాగారంలో తవ్వకాలు జరుపుతుండగా ఒక సెల్ ఫోన్ లభ్యమైనట్టు వెల్లడించారు. అలాగే ఇతర జైళ్లలో కూడా తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో విశాఖపట్నంలో కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు దొరికిన వైనాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ జైలులోని సుమారు 7 ఎకరాల స్థలంలో సుమారు రెండు అడుగుల లోతులో 8 చోట్ల తవ్వకాలు జరిపించారు. ఈ క్రమంలో కావేరి బ్యారెక్స్ సమీపంలో రెండు సెల్ ఫోన్లు లభించాయి. అందులోని సిమ్‌లను పరిశీలించగా, గత అక్టోబర్‌లో వినియోగించినటట్టు తెలిసింది.

మహిళలు ఉండే స్వర్ణముఖి బ్యారెక్స్‌తో పాటు ఏడు బ్యారెక్స్‌లో జైలు సిబ్బందితో ఈ తవ్వకాలు చేపట్టినట్టు తెలిపారు. జైలుకు నవంబరు నెల నుంచి కొత్త సిబ్బంది వచ్చిన తరువాత సెల్‌ఫోన్లు వాడలేదని సూపరింటెండెంట్ మహేశ్ బాబు తెలిపారు. తాజాగా రెండు సెల్‌ఫోన్లు దొరికిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. తాజాగా దొరికిన రెండు సెల్‌ఫోన్లతో కలిపి ఈ కారాగారంలో ఇప్పటి వరకూ ఆరు సెల్‌ఫోన్లు దొరికినట్టు చెప్పారు.

జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం నూతన కార్యవర్గం బుధవారం బాధ్యతలు స్వీకరించింది. సంఘం నూతన అధ్యక్షుడిగా పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సంజీవరెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మద్దాల రమేష్, ఉపాధ్యక్షులుగా గుర్రం సింహాచలం, బర్ల రామానాయుడు, ట్రెజరర్‌గా సిరికి శ్రీనివాసరావు, జాయింట్ ట్రెజరర్‌గా మధుపాడ రవికుమార్, జాయింట్ కార్యదర్శులుగా బూటు కృష్ణ, కె.అప్పలనాయుడు ఎన్నికైన విషయం తెలిసిందే. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సంఘం కార్యాలయంలో వారంతా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో బాయ్‌బిల్డింగ్ కాంట్రాక్టర్లు కేజీ రామారావు, కిలపర్తి సత్యం, వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగ కాశీవిశ్వేశ్వర ఆలయ వార్షికోత్సవం



అన్న సమారాధనలో పాల్గొన్న వెలగపూడి ప్రతాపరుద్ర

ఆరిలోవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 13వ వార్డులో గల జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో వెలసిన కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం 3వ వార్షికోత్సవం పూజలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాపరుద్ర బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కారన్యక్రమలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

16, 17 తేదీల్లో 8వ జోన్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

వెంకోజీపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాలకు ఈ నెల 16, 17 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేసే పథకం 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్‌లైను రాయ్‌పూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనులు భాగంగా, అమృత్-2.0, 24/7 వాటర్ సప్లై సిస్టం నెట్ వర్క్ అభివృద్ధిలో భాగంగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చుట కోసం 24 గంటలు తాటిపూడి ప్రధాన పైపులైన్ నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. ఉత్తరాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో తాటిపూడి 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైన్ రీరూటింగ్ పనులు చేయు నిమిత్తం ఈ నెల 16న ఉదయం 11.30 గంటలు నుంచి 17వ తేదీ ఉదయం 11.30 గంటల వరకు మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు-93(పి) నుంచి వార్డు 98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణా నగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీకాలనీ, గోకుల్ధాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం, తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ ప్రాంతాల్లో ట్యాంకర్లద్వారా మంచి నీటి సరఫరా చేయడం జరుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు. కాబట్టి నగర ప్రజలు సహకరించాలని కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు.

గుర్రం స్వారీ శిక్షణ కేంద్రంపై దాడి : కేసు నమోదు

ఎంవీపీ కాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : లాసన్స్‌బే కాలనీ శాంతి ఆశ్రమం ఆవరణలో ఏర్పాటు చేసిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రంపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ధనుంజయనాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 23 నుంచి 26వరకూ వివిధ సందర్భాల్లో ఒక ఎద్దును శిక్షణ కేంద్రంలోకి పంపించడం, గుర్రాలను గాయపరచడం, శిక్షణా కేంద్రంలోకి 15 మంది వ్యక్తులు చొరబడి, సామగ్రిని బయటకు విసిరేసి, గేట్లు మూసివేయడం వంటి సంఘటనలతో పాటు, కేంద్రాన్ని ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించినట్టు కేంద్రం నిర్వాహకులు హిమబిందు ఫిర్యాదు చేశారు. గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రంపై సిద్ధార్థ్ అలియాస్ సిద్ధూ పంపిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎంవీపీ కాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందినట్టు ఎంవీపీ పోలీసులు తెలిపారు. అనకాపల్లి గవరపాలెం కర్రివారి వీధిలో ఉంటున్న కర్రి లక్ష్మణరావు (39) ఈ నెల 18న ఆటోలో ఎండాడ నుంచి నగరంలోకి వస్తుండగా, ఆటో డ్రైవర్ అబ్దుల్ మజీద్ వాహనాన్ని అతి వేగంగా నడుపుతూ వెంకోజీపాలెం వద్ద విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మణరావుకు తీవ్ర గాయాలపాలవడంతో ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న లక్ష్మణరావు మంగళవారం రాత్రి మృతి చెందినట్టు ఏఎస్ఐ సత్యం తెలిపారు.

అభివృద్ధి పనులకు సహకరించండి



మేయర్ పీలాకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, కొత్త పనులకు సహకరించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావును బుధవారం 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అభ్యర్థించారు. ఆయనను కలసి వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో ఇప్పటికే పలు పనులు పూర్తిచేశామని, గత పాలక మండలి తీరు కారణంగా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరతగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు.

డాబాగార్డెన్స్‌లో విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే

డాబాగార్డెన్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆదేశాల ప్రకారం బుధవారం డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో దివ్యాంగ బాలబాలికల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఏపీసీ జె.చంద్రశేఖరరావు తెలిపారు. కృష్ణాగార్డెన్స్ పరిసర ప్రాంతాలను విద్యాశాఖ అధికారులు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత సందర్శించి ప్రభుత్వ పాఠశాలల ద్వారా దివ్యాంగ బాలబాలికలకు కల్పిస్తున్న సదుపాయాలను తెలియజేశామన్నారు. రాయితీలు, భవిత కేంద్రంలో అందిస్తున్న చదువు, ఫిజియోథెరపీ సేవలను, ఉపకార వేతనాలను తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించామన్నారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల క్రీడ, విద్య, సాంస్కృతిక రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని తెలియజేశామన్నారు. ఐఈఆర్‌పీలు శ్వేతలత, ప్రతిమ, ప్రియ పాల్గొన్నారు.

జోన్-4 కార్యాలయంలో నేడు కీలక సమావేశం

అల్లిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలన సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల పునఃరూపకల్పన ప్రతిపాదనలో భాగంగా గురువారం ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-4 కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు.

టీడీపీ సమావేశానికి హాజరు

మురళీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఉత్తర నియోజకవర్గ నాయకులు పలువురు హాజరయ్యారు. నియోజకవర్గాల వారీగా జరిగిన సమావేశంలో వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై ఆరా తీసినట్లు టీడీపీ నేత వరప్రసాద్ తెలిపారు.

తగ్గిన విద్యార్థులతో ఉపాధ్యాయ పోస్టుల్లో కోత

... 5వ పేజీ తరువాయి

చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి విద్యా సంవత్సరంలో వైసీపీ హయాంలో చేపట్టిన సంస్కరణలనే అమలు చేయడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. తాజాగా జారీ చేసిన జీవో నంబర్-21 మేరకు ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వుల మేరకు జిల్లాలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి మేరకు టీచర్లను కేటాయించారు. జిల్లాలో ప్రధానంగా చంద్రంపాలెం, తోటగరువు, గాజువాక, నడుపూరు, ఆనందపురం, తదితర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రాథమిక పాఠశాలల విషయంలో కొత్తగా అమలు చేసిన మోడల్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 3, 4, 5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన ప్రభావం మొత్తం ప్రాథమిక పాఠశాలలపై పడింది. అనేక ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో జిల్లాలో పలుచోట్ల పాఠశాలల్లో పది మంది కంటే తక్కువకు విద్యార్థుల సంఖ్య పడిపోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా అమలు చేసిన సంస్కరణల మేరకు ప్రాథమిక పాఠశాలలపై ఫోకస్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

ఎర్నిమాంబ జాతర మహోత్సవానికి ఏర్పాట్లు



అల్లిపురంలో పుష్పాలంకారంలో ఎర్నిమాంబ అమ్మవారు



జాతర మహోత్సవానికి పందిరిరాట వేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అర్ధాంగి పద్మజ తదితరులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

జ్ఞానాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామస్థుల ఇలవేల్పు, సంతాన దేవతగా పూజలందుకునే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.శనివారం తొలేళ్ల, ఆదివారం ప్రధాన పండుగ నిర్వహిస్తారు. ఎనభై ఏళ్ల క్రితం ఆవిర్భవించిన అమ్మవారు అచ్చియ్యమ్మపేట గ్రామస్థుల కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందారు. సంతానం లేని వారు అమ్మవారిని వేడుకుంటే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం. ఇందుకోసం ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. గతంలో స్థానిక భక్తుల అజమాయిషీలో ఆలయం నడిచేది. భక్తుల తాకిడి, ఆదాయం పెరగడంతో ఆలయాన్ని దేవదాయ శాఖలో విలీనం చేశారు. గత ఏడాది విశాఖ డెయిరీ ఆర్థిక సహాయంతో ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఈవో పర్యవేక్షణలో ఆలయం కొనసాగుతోంది. ఏటా మే నెల మూడో ఆదివారం అమ్మవారి ప్రధాన పండుగ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం పందిరిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అర్ధాంగి పద్మజ పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జ్ఞానాపురం గ్రామ ప్రజల సహకారంతో నీలధార కార్యక్రమం, శనివారం తొలేళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు.ఈ ఉత్సవం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి ప్రారంభమై కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు అమ్మవారి ప్రతిమల ఊరేగింపు జరుగుతుందన్నారు. జాతర రోజు అమ్మవారికి పుష్పాలంకరణ చేస్తామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.

ఎరుకుమాంబకు నూతన వస్త్రాల సమర్పణ

దొండపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అర్ధాంగి పద్మజ బుధవారం దర్శించుకొన్నారు. ఆమె అమ్మవారికి జలాభిషేకం చేసి నూతన వస్త్రాలను సమర్పించారు. 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, ఆలయ ఈవో రమాభాయి ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 27, 42 వార్డుల టీడీపీ, బీజేపీ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కన్నం గురుగోవింద్, నాయకులు పి.లక్ష్మీశివప్రసాద్, మజ్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి : కలెక్టర్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజెండాలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా మెగా క్లీనింగ్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు. మసీదులు, పార్కులు, బస్, రైల్వేస్టేషన్లు, వసతి గృహాలు, ఆస్పత్రులు, తదితర ప్రాంతాల్లో ప్రతి మూడో శనివారం పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సీపీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. టెర్రస్ గార్డెన్, తడి, పొడి చెత్త సేకరణ, ప్రజా మరుగుదొడ్ల వినియోగంపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కేంద్రీయ విద్యాలయంలో శతశాతం ఉత్తీర్ణత



హరిచందన గరికిన (పదో తరగతి)



కె.దీక్షిత (ప్లస్-2)

కంచరపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 104 కేంద్రీయ విద్యాలయం-1 విద్యార్థులు ప్రతిభ చూపారు. సీబీఎస్ఈ పది, పన్నెండు తరగతుల పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ జి.కిశోర్ పేర్కొన్నారు. తమ కేవీలో పదోతరగతిలో గరికిన హరిచందన 488/500 మార్కులతో ప్రథమ స్థానం పొందగా, మోనమ్ దాస్ 480 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు. పన్నెండో (ప్లస్-2) తరగతి పరీక్షల్లో హ్యూమనిటీస్ స్ట్రీంలో కె.దీక్షిత (485/500) ప్రథమ స్థానం, వేమూరి శ్రీహిమజ, సౌమ్యశర్మ (474/500) మార్కులతో ద్వితీయ స్థానం, సైన్స్ స్ట్రీంలో కె.నూతన శ్రీమనోజ (465/500) ప్రథమ స్థానం, ఆర్.సూర్య (454/500) మార్కులు వచ్చాయన్నారు. పది, పన్నెండు తరగతుల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

కార్మికులను ఎండల నుంచి ఆదుకోండి



మాట్లాడుతున్న జేసీఎల్ రామారావు

అక్కయ్యపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) ఎం.రామారావు సూచించారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పించారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతను కాపాడేందుకు పరిశ్రమల యజమానులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్మికులకు పాదరక్షలు, టోపీలు సమకూర్చాలని సూచించారు. సీఎస్సార్ ఫండ్ కింద సంస్థ ఆవరణలో ఉచితంగా మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ లిమిటెడ్ (గాజువాక), లారస్ ల్యాబొరేటరీస్ సంస్థ (పరవాడ)ల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీవీఎంసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



నగదు చెక్కు అందిస్తున్న ఎం.వెంకటరావు, బీజేపీ నాయకులు, ప్రధానోపాధ్యాయిని

మాధవధార, మే 15 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు విద్యార్థులకు బుధవారం బీజేపీ నాయకులు నగదు ప్రోత్సాహం అందించారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 580 మార్కులు దాటిన 8 మంది జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు అందించారు. ప్రధానోపాధ్యాయిని బి.హేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి టి.పద్మ, నాయకులు విజయచంద్రుడు, ఎస్.దిలీప్, ఎం.వెంకటరావు, కె.వెంకట్, సత్య పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయిని బి.హేమలతకు నాయకులు శాలువా సత్కారం జరిపారు. ఫలితాల సాధనకు ఆమె చేసిన కృషిని కొనియాడారు.

కొనుగోలు చేసిన తులంన్నర బంగారం ఆటోలో మాయం

పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

సీతంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మారికవలసకు చెందిన రోహిణి అనే మహిళ నగరంలోని ఓ నగల దుకాణంలో బుధవారం తులంన్నర బంగారం కొనుగోలు చేసి ఆటో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో ఓ మహిళ కూర్చుని ఉంది. ఇద్దరూ ప్రయాణించిన తరువాత డైమండ్ పార్క్ దగ్గరకు వచ్చేసరికి ఆ మహిళ ఆటో నుంచి దిగిపోయింది. రోహిణి మరికొంత దూరం వెళ్లి పర్సు చూసుకోగా కొనుగోలు చేసిన తులంన్నర బంగారం కనిపించలేదు. ఉలిక్కిపడి లబోదిబోమంటూ ఆమె నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ చెట్లను కూల్చేయండి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ పద్మరెడ్డి

సీతమ్మధార, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో కుళ్లిపోయిన మొదళ్లతో ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి వార్డులో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చెట్ల కింద కొందరు మద్యం తాగుతున్నారని, కొన్ని చెట్ల మొదళ్లు కూడా కుళ్లిపోయి ఏక్షణమైనా కూలిపోయే స్థితిలో ఉన్నందున వాటిని తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆ చెట్లను తొలగిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగించినవారికి జరిమానా



ప్లాస్టిక్ సంచుల వాడకంపై పూల వ్యాపారులను హెచ్చరిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, మే 14 (ఆంధ్రజ్యోతి): వద్దని వారించినా ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానాలు విధిస్తామని జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంపై జోన్-3 పరిధిలో సీతమ్మధార రైతుబజార్, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ సంచులు వాడుతుండటంతో సీజ్ చేసి జరిమానాలు విధించారు. జీవీఎంసీ ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గల తిరుమల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకుగాను 120 మార్కులు ఆరుగురు విద్యార్థులు బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నాపాల రోహన్ సాధించార న్నారు. 119మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతోపాటు 50 లోపు 14మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79మంది విద్యార్థులు సాధించార న్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌లు అభినందించారు.

కల్యాణ మండపం శ్లాబ్ కూలి ఐదుగురికి గాయాలు

సీతంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తి మండావారి వీధిలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో శుభకార్యక్రమం విందు జరుగుతుండగా శ్లాబ్ కూలి ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు. విందు ఆరగిస్తుండగా ఫ్యాన్ వద్ద శ్లాబ్ కూలిపోవడంతో బాలకృష్ణ, శంకర్ అనే వ్యక్తుల తలపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే బాలరాజు అనే వ్యక్తి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

నేటి నుంచి ఏడు అదనపు సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా కాంప్లెక్సు నుంచి దూర ప్రాంతాలకు 3, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు 4 అదనపు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. విశాఖ నుంచి అమలాపురానికి ప్రతి 40 నిమిషాలకు ఒక షెడ్యూల్ బస్సు ఉంది. కానీ ఈ రూట్‌లో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఉదయం 8.45 గంటలకు మరో అదనపు సర్వీసు నడపనున్నారు. ద్వారకాబస్‌స్టేషన్ నుంచి కాకినాడకు ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా ఉదయం 5.15 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు అదనపు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే నగరంలోని గాజువాక, ద్వారకాబస్‌స్టేషన్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు నాలుగు అదనపు బస్సులు నడపనున్నారు. గురువారం ఉదయం నుంచి అదనపు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు.

19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆరిలోవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వీటితో పాటు ఓపెన్ స్కూలు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెగ్యులర్ వారికి జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు జరుగుతాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్షలు జరుగుతాయని ఓపెన్ స్కూలు సొసైటీ సంచాలకులు నరసింహారావు తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి 12-30 వరకు జరుగుతాయని తెలిపారు. 9 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెన్ టెన్త్ పరీక్షలకు 640 మంది విద్యార్థులు, 5 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 814 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై కీలక నిర్ణయం

ఏయూ నుంచి వెనక్కి పంపేందుకు లేఖ రాస్తానన్న వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చి ఫ్యాకల్టీగా కొనసాగుతుండడంపై గడిచిన కొన్నేళ్ల నుంచి రచ్చ జరుగుతోంది. ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలంటూ వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర అధికారులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఏయూ అధికారులకు కూడా కాలేజియేట్ కమిషనర్ నుంచి మూడుసార్లు లేఖలు కూడా వచ్చినట్టు చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీని కొనసాగిస్తారా.. వెనక్కి పంపిస్తారా.? అని వచ్చిన లేఖలపై వర్సిటీ అధికారులు ఇప్పటివరకు సమాధానం కూడా చెప్పలేదు. కాలేజియేట్ కమిషనర్ నుంచి ఏయూ అధికారులకు వచ్చిన లేఖల విషయాన్ని కొందరు వీసీ జీపీ రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లడంతో బుధవారం ఆయన కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీలోని వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, డీన్లతో నిర్వహించిన సమావేశంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీని ఏం చేద్దామని ప్రశ్నించారు. దీనిపై వారంతా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపాలన్న అభిప్రాయాన్ని దాదాపు అందరూ వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై వీసీ స్పందిస్తూ వారిని వెనక్కి పంపించేలా లెటర్ రాస్తానని చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆయన లేఖ రాసే అవకాశం ఉంది.

ఇదిలావుండగా కాలేజియేట్ కమిషనర్ నుంచి వచ్చిన లేఖల విషయాన్ని తనకు చెప్పకపోవడంపైనా వీసీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. తనకు తెలియకపోవడం వల్లే దీనిపై నిర్ణయం తీసుకోలేకపోయానని ఆయన చెప్పినట్టు పలువురు చెబుతున్నారు. అయితే ఒక సీనియర్ ప్రొఫెసర్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లడం వల్లే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదిఏమైనా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపేందుకు వీసీ నిర్ణయం తీసుకోవడంతో ఏయూ అధ్యాపకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నగర అభివృద్ధికి సహకరించండి

సీఎం చంద్రబాబుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర అభివృద్ధికి సహకరించవలసిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మేయర్‌గా ఎన్నికైన తరువాత తొలిసారిగా ఆయన బుధవారం అమరావతిలో సీఎంను పలువురు ప్రజాప్రతినిధులు, నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావును చంద్రబాబునాయుడు అభినందించారు. గత మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు అవిశ్వాసం నెగ్గేలా చేయడానికి కృషి చేసిన మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంపీలు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లను సీఎం అభినందించారు. మేయర్‌గా నగరాభివృద్ధికి కృషి చేయాలని పీలాకు సూచించారు. కార్పొరేటర్లు, కూటమి ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ పాలన సాగించాలన్నారు. మేయర్ బాధ్యతలు చేపట్టాక ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణపై విశేషంగా కృషి చేస్తున్నారంటూ పీలా శ్రీనివాస్‌ను అభినందించారు. చంద్రబాబును కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఉన్నారు.

డిప్యూటీ మేయర్ ఎంపిక నిర్ణయం మీదే..

... 5వ పేజీ తరువాయి

పలువురు ఆశిస్తుండడంతో దీనిపై కూడా సీఎం చంద్రబాబుతో చర్చించేందుకు నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, తదితరులు అమరావతి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వద్ద డిప్యూటీ మేయర్ పోస్టుకు పలువురు పోటీ పడుతున్నారని, యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన కూటమి కార్పొరేటర్ల నుంచి తీవ్రమైన పోటీ నెలకొన్నట్టు మేయర్, ప్రజాప్రతినిధులు వివరించారు. 'వీరిలో ఎవరిని ఎంపిక చేస్తారో నిర్ణయం మీదే' అని చంద్రబాబుకు చెప్పగా.. అందుకు ఆయన స్పందిస్తూ స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని, కూటమి పార్టీలకు నష్టం వాటిల్లకుండా, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేలా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలంతా కూర్చుని ఏకాభిప్రాయంతో డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలని సూచించినట్టు తెలిసింది. దీంతో డిప్యూటీ మేయర్ ఎంపిక మళ్లీ నగర ప్రజాప్రతినిధుల కోర్టులోకి వచ్చినట్టయింది. దీంతో సీఎం సమక్షంలో డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై పంచాయితీ తేలిపోతుందని భావించిన ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది.

మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.6,100 కోట్ల ప్రైవేటు రుణం

... 5వ పేజీ తరువాయి

అవసరం అవుతుందని, ప్రైవేటు భూములకు చెల్లించడానికి రూ.882 కోట్లు కావాల్సి ఉంటుందని లెక్కలు వేశారు. ఢిల్లీ వెళ్లినపుడల్లా దీనిపై చర్చలు జరిపారు. అక్కడ ఏమైందో తెలియదు గానీ తాజాగా మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి బుధవారం అమరావతిలో ప్రైవేటు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి విశాఖతో పాటు అమరావతి మెట్రో రైలు ప్రాజెక్టుకు తక్కువ వడ్డీతో రుణ సాయం చేయాలని కోరారు. విశాఖ ప్రాజెక్టుకు రూ.6,100 కోట్లు రుణంగా అవసరం అవుతుందని ప్రతిపాదించారు. ఈ సమావేశానికి ఏడీబీతో పాటు ఇంకా అనేక బ్యాంకులు హాజరయ్యాయి. పీపీపీ విధానంలో ప్రైవేటు బ్యాంకులు రూ.6,100 కోట్లు సమకూరిస్తే మిగిలిన మొత్తం రూ.5,398 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. ఇది కాకుండా భూ సేకరణకు అవసరమైన మొత్తం రూ.882 కోట్లు ఏపీ ప్రభుత్వం సమకూర్చుకోవాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పట్టాలపైకి వస్తుంది.

కేజీహెచ్‌లో తాగునీటి కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీంతో బాత్రూమ్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోందని, అక్కడ దుర్వాసనతో ఇబ్బందులు పడుతు న్నామని రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న రోగి సహాయకుడు నాయుడు తెలిపారు. ఆస్పత్రిలో తాగునీరు లభ్యం కాకపోవడంతో రెండు రోజుల నుంచి బయటే వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నా మని, నీటి సమస్య వేసవిలో ఉత్పన్నమవుతుందని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని డి.వెంకటరావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. కాగా కార్డియాలజీ విభాగం వద్దనున్న ఆర్వో ప్లాంట్ వద్ద నీరు రాకపోవడం మాట పక్కన పెడితే దానిని ముట్టుకుంటేనే కరెంట్ షాక్ కొడుతుందని పలువురు రోగుల సహాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి నీటి ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రోగులతో పాటు వారి సహాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరఫరా ఏదీ?

కేజీహెచ్‌లోని వార్డులు, నర్సింగ్ కాలేజీ, హాస్టళ్లతో పాటు అధికారుల చాంబర్స్‌కు అవసరమయ్యే నీటిని జీవీఎంసీ సరఫరా చేస్తుంది. రోజువారీ అవసరాల కోసం కేజీహెచ్‌కు 500 నుంచి 600 కిలోలీటర్ల నీరు అవసరం అవుతుంది. ఈ నీటి సరఫరా కోసం కేజీహెచ్‌లో ఐదుచోట్ల నీటిని నిల్వ చేసే సంపులు ఉన్నాయి. ఈ సంపులకు రెండు మార్గాల ద్వారా జీవీఎంసీ నీటిని సరఫరా చేస్తుంది. ఈ మేరకు నీటిని సరఫరా చేయకపోవడం వల్లే సమస్యలు ఎదురవుతున్నట్టు పలువురు పేర్కొంటున్నారు.

నేడు దుర్గమాంబ జాతర

» భారీ ఎత్తున ఏర్పాట్లు



అగనంపూడి మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ జాతర కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి ప్రధాన రహదారుల వరకు భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. గ్రామంలో పూర్తి స్థాయిలో విద్యుత్ కాంతులీనుతున్నాయి. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు చేసేందుకు వేదికలను ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోడి ఘటాల జాతర, కోటి దీపాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించి పూజలు చేశారు. అంతకుముందు మహిళలు వివిధ రకాల పిండి వంటలను తయారు చేసి అమ్మవారికి సారెగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ రామునాయుడు, దుల్ల చెల్లారావు, వరం బాబు, రామారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ అనుపోత్సవం

పెదగంట్యాడ, మే 14(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం లో తొమ్మిది రోజుల పాటు జరిగిన దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. సీతానగరం గ్రామాభ్యుదయ సేవా సంఘం ఈ ఉత్సవాల నిర్వహణకు సారథ్యం వహిస్తున్నది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు, దర్శనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలు, నేల వేషాలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు జరుగనుంది. రాత్రికి సీతానగరం ప్రాథమిక పాఠశాల గ్రౌండ్‌లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. సీతానగరం గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు నంబారు సింహాద్రి, కార్యదర్శి మొల్లి సింహాద్రి, కార్యవర్గం సభ్యులు నమ్మి అప్పారావు, నక్క వెంకటరమణ, నమ్మి అప్పలనాయుడు, చట్టి సింహాచలం ఈ కార్యక్రమాలనిర్వాహణకు సారధ్యం వహిస్తున్నారు.

నారా లోకేశ్‌ను కలసిన కార్పొరేటర్ గోవిందరెడ్డి



అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బుధవారం రాష్ట్ర విద్యాశాఖ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు గాజువాక నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను లోకేశ్‌కు వివరించినట్టు గోవిందరెడ్డి తెలిపారు.

సినిమా గైడ్

- **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)
- **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)
- **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడ దుంపలు 34, కంద 84, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట)20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ30, కర్రపెండలం 18, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

» అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ పేరుతో ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్, షోకాజు నోటీసులు ఇచ్చిన యాజమాన్యం వీటిని తక్షణమే విరమించుకోవాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు షోకాజు నోటీసులు, సస్పెన్షన్ ఇవ్వడాన్నినిరసిస్తూ బుధవారం ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం మార్గంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ప్లాంటు యాజమాన్యం నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాస్తూ.. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసే చర్యలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగులపై దాడులు, వేధింపులకు దిగితే వారి ఆత్మస్థైర్యం దెబ్బ తింటుందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ ప్రభావం ప్లాంటు ఉత్పత్తిపై పడుతుందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, డి.ఆదినారాయణ, వీవీ రమణమూర్తి, రామస్వామి, వైటీ దాసు, రామ్‌కుమార్, డీవీ రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్స చేసి చిన్నారిని కాపాడిన కిమ్స్ ఐకాన్ వైద్యులు

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే తిరగబడిన మూత్రపిండంతో తీవ్ర అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న మూడేళ్ల చిన్నారికి షీలా నగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి పునర్జన్మ అందించారు. నగరానికి చెందిన మూడేళ్ల బాలిక తీవ్రమైన ఇన్ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు.బాలిక పుట్టుకతోనే మూత్రపిండం తిరగబడి ఉండడంతో మూత్రనాళాలలో అడ్డంకి ఏర్పడి ఇన్ఫెక్షన్‌లు సోకాయి. బరువు తగ్గడం, కడుపు నొప్పి వంటి తీవ్ర సమస్యలు ఎదురవుతున్నట్లు యూరాలజీ నిపుణుడు డాక్టర్ అభిరామ్ కుచ్చర్లపాటి గుర్తించారు. చిన్నారికి అరుదైన లాపరోస్కోపిక్ పైలోప్లాస్టీ అనే సూక్ష శస్త్ర చికిత్స చేశారు. దీంతో చిన్నారి తక్కువ నొప్పితో త్వరగా కోలుకోవడం జరిగిందని వైద్యుడు అభిరామ్ తెలిపారు. చిన్నారికి పునర్జన్మ ఇచ్చిన వైద్య బృందాన్ని చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

16, 17 తేదీల్లో 8వ జోన్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాలకు ఈ నెల 16, 17 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేసే పథకం 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్‌లైను రాయ్‌పూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనులు భాగంగా, అమృత్-2.0, 24/7 వాటర్ సప్లై సిస్టం నెట్‌వర్క్ అభివృద్ధిలో భాగంగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చుట కోసం 24 గంటలు తాటిపూడి ప్రధాన పైపులైన్ నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. ఉత్తరాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో తాటిపూడి 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైన్ రీరూటింగ్ పనులు చేయు నిమిత్తం ఈ నెల 16న ఉదయం 11.30 గంటలు నుంచి 17వ తేదీ ఉదయం 11.30 గంటల వరకు మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు-93(పి) నుంచి వార్డు 98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణా నగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీకాలనీ, గోకుల్ధాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్‌బీసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం, తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఈ ప్రాంతాల్లో ట్యాంకర్లద్వారా మంచి నీటి సరఫరా చేయడం జరుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు. కాబట్టి నగర ప్రజలు సహకరించాలని కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే చర్యలను ఉపసంహరించుకోవాలి

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నఉద్యోగులకు యాజమాన్యం షోకాజు నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ చేయడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ)కు ఉక్కు గుర్తింపు యూనియన్ నేతలుబుధవారం లేఖ రాశారు. సంస్థకు, ఉత్పత్తికి ఎటువంటి నష్టం కలగకుండా ఉద్యోగులు ఒక చోట చేరి చర్చించుకుంటే దీనిని యాజమాన్యం తీవ్రంగ పరిగణించటం సరికాదన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయటం తగదని, దీనిపై స్పందించాలని కోరారు.

సమ్మెకు కార్మిక సంఘాలు సిద్ధం


చర్చిస్తున్న కార్మిక సంఘాల నేతలు

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణతో పాటు కార్మిక హక్కుల రక్షణ కోసం ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను భెల్ హెచ్‌పీవీపీలో విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాలు తీర్మానించాయి. భెల్ టౌన్‌షిప్‌లో బుధవారం కర్మాగారంలోని గుర్తింపు యూనియన్‌తో పాటు అన్ని కార్మిక సంఘాలు సమావేశమై సమ్మె విజయవంతం గురించి చర్చించాయి. ఈనెల 20న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేసిన నాడే కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు తమ ఐక్యతను చాటగలరని అన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు శుబాకర్ సాహు, బొండా బాబురావు, కొల్లి దేముడు, జీటీపీ ప్రకాశ్, సీతంనాయుడు, ఎ.అప్పారావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకి అంతరాయం

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) :బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల మింది, తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఈనెల 16న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, పంతులుగారి మేడ, దశమికొండ, పంచవటి టౌన్‌షిప్, విశాల్‌మార్ట్ ఏరియా, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

తిరుమల నగర్‌లో స్వచ్ఛ భారత్


పార్కును శుభ్రం చేస్తున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం,మే 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వల్ల అంటురోగాలు దరికి చేరవని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం,విశ్వేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్ తదితర ప్రాంతాలలో చెత్తా చెదారం,పిచ్చి మొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్ర పరిచారు.ఈ కార్యక్రమంలో పరమానందం,పరమేశ్వరరావు,చంద్రశేఖర్, సన్యాసిరావు,మహేష్,వర్మ,వసంత రెడ్డి,భాస్కరరావు,శ్రీనివాస్,చంద్ర శేఖర్,రమణ, అర్జున్,భాస్కరరావు తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సమావేశాలు నిర్వహిస్తే చర్యలు

» మరోసారి ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని యాజమాన్యం హెచ్చరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌లోని పని ప్రదేశం వదిలి వెళ్లరాదని, అలా కాకుండా నిబంధనలను ఉల్లంఘించి వెళితే చర్యలు తీసుకునేందుకు యాజమాన్యం వెనకడుగు వేయడం లేదు. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా ప్లాంట్‌లో ప్రచారాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో యాజమాన్యం బుధవారం మరోసారి సర్క్యులర్ ఇచ్చింది. పని సమయంలో పని ప్రదేశం వదిలి వెళ్లరాదని, ఎటువంటి సమావేశాలు, సభలు నిర్వహించరాదని, పాల్గొనరాదని పేర్కొంది. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కంపెనీ నిబంధనల మేరకు చర్యలు తప్పవని స్పష్టం చేస్తోంది.

కాగా, కొంత కాలం క్రితం వరకు ప్లాంటులో నిత్యం యూనియన్ల సమావేశాలు జరుగుతుండేవి. స్టీల్‌ప్లాంట్‌లో పలు యూనియన్‌లకు, కాంట్రాక్టు కార్మిక సంఘాలకు ప్లాంటులో కొన్ని పాయింట్ (సమావేశాలు నిర్వహించుకునే ప్రదేశాలు)లు ఉన్నాయి. ఉదయం జనరల్ షిఫ్ట్ సమయానికి వెళ్లే ఉద్యోగులు ముందుగా వెళ్లి ఆయా యూనియన్ పాయింట్‌ల వద్ద చేరి కొన్ని విషయాలపై చర్చించుకునే వారు. అలాగే కొన్ని సందర్భాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో కూడా సమావేశాలు నిర్వహించుకునేవారు. ఈ మధ్యకాలంలో వీటిని యాజమాన్యం తీవ్రంగా పరిగణిస్తోంది. ప్లాంటులో పని ప్రదేశం వదిలి వెళ్లరాదని కఠిన నిబంధనలు అమలు చేయడంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ సమావేశాలకు హాజరైతే యాజమాన్యం ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందోనని కార్మిక నాయకులు, ఉద్యోగుల్లో భయం వెంటాడుతోంది.

బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 18న వైద్య శిబిరం

అగనంపూడి, మే 14 (ఆంధ్రజోతి) : ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ శిబిరంలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా పరీక్షించి మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే రామకోటి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హనుమంతురావు, బి.సత్యనారాయణ, మొల్లి కోటి, నరసింహమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీబీఎస్‌సీ ఫలితాల్లో యాపిల్ ఐ స్కూలు జయకేతనం


12 తరగతి విద్యార్థి సోహినిని అభినందిస్తున్న తలశిల బలరామకృష్ణ

శ్రీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ-2025 విడుదలైన సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10 తరగతి, 12 తరగతి ఫలితాల్లో శ్రీనగర్ యాపిల్ ఐ స్కూలు విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచి, శత శాతం ఉత్తీర్ణత సాధించినట్టు యాపిల్ ఐ స్కూలు చైర్మన్ తలశిల బలరామకృష్ణ తెలిపారు. 12 తరగతి విద్యార్థి సోహిని 85 శాతం మార్కులతో, 10 తరగతి విద్యార్థి ఎస్.అక్షరకు 94 శాతం మార్కులతో స్కూలు టాపర్‌గా నిలిచారన్నారు. 88 మంది విద్యార్థులకు 88 మంది ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలు సాధించారని తెలిపారు. 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఈ పరీక్షలకు 12వతరగతిలో 24 మంది విద్యార్థులు హాజరవగా అందరూ ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ తమ స్కూలు గత 11 ఏళ్లగా శత శాతం ఫలితాలు సాధిస్తూ విజయపరంపరతో రికార్డులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఇంతటి అద్భుత ఫలితాల వెనుక స్కూలు ప్రోగ్రాములు, అధ్యాపక, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నాయని, వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్స్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, జయశ్రీ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెందుర్తిలో చెరువు స్థలాలు కబ్జా


పెందుర్తిలో చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు (ఫైల్)

పెందుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రెవెన్యూ పరిధిలోని చెరువులను కబ్జాదారులు చెర పడుతున్నారు. చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో చెరువుల రూపురేఖలు మారిపోయి ఊళ్లను తలపిస్తున్నాయి. జల వనరుల (వాటర్ బాడీస్) సంరక్షణ చట్టాన్ని సవాల్ చేస్తూ చెరువుల స్థలాన్ని పరాధీనం చేస్తున్నారు. పెందుర్తిలోని సర్వే సంఖ్య 230లో 20 ఎకరాల విస్తీర్ణం గల గోకాడ చెరువు ఆక్రమణలతో కుచించుకుపోయింది. కబ్జాదారుల దెబ్బకు పది ఎకరాలు పైగా ఆక్రమణకు గురైందని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి చెరువును ఆక్రమించి సుమారు 50 ఇళ్లు నిర్మించారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. పెందుర్తిలో 6.85 ఎకరాల విస్తీర్ణం గల విజయ రామసాగర్ చెరువులో సుమారు రెండెకరాలు ఆక్రమించిన ఓ రియల్ వ్యాపారి సుమారు 40 ఇళ్లతో కాలనీ నిర్మించాడు. చినముషిడివాడలోని సర్వే నంబర్లు 165, 185, 186, 189లోని సుమారు 40 ఎకరాలు చెరువులో 25 ఎకరాలుపైగా ఆక్రమణకు గురైంది. ఇళ్లు, భారీ భవనాలు, బహుళ అంతస్తులు నిర్మించారు. చినముషిడివాడ, సుజాతనగర్‌లో చెరువును ఆక్రమించి షెడ్లు నిర్మించి రూ.లక్షల్లో విక్రయాలు జరుపుతున్నారు. చెరువు ఆక్రమణ వ్యవహారం ఈ ప్రాంతంలో భూ మాఫియాగా మారింది. కిష్టరాయపురం, లక్ష్మీపురంలోని రాముడు చెరువులు ఆక్రమణలతో కుచించుకుపోయాయి.

నోటీసులు జారీ చేసినా..

రెవెన్యూ నోటీసులు జారీ చేసినా ఆక్రమణల జోరు తగ్గటం లేదు. గత ఏడాది 15 ఎకరాల ఆక్రమణకు సంబంధించి 414 మందికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. చెరువు, గెడ్డ, వాగులను ఆక్రమించారు. పెందుర్తిలో 257, చినముషిడివాడలో 73, వేపగుంటలో 25, లక్ష్మీపురంలో 8, సరిపల్లిలో 31, ఎస్ఆర్‌పురంలో 14, గుర్రంపాలెంలో 6 మొత్తంగా సుమారు 15 ఎకరాలు విస్తీర్ణంలో గల వాటర్ బాడీస్ ఆక్రమించి చేపట్టిన 414 మందికి సెక్షన్ 7 నోటీసులు జారీ చేశారు. ఏడాదిన్నర కాలంగా నోటీసులతో సరిపెడుతూ, ఆక్రమణల తొలగింపు జోలికి పోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కోర్టుకు వెళ్లాలని కొందరు రెవెన్యూ సిబ్బందే ఆక్రమణదారులకు సలహాలు ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. చెరువుల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోకపోతే ఆక్రమణలతో బక్కచిక్కిన చెరువులకు వరదలు వస్తే పెందుర్తి ముంపు నకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నా యని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు

రెవెన్యూ పరిధిలోని చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్త మార్గదర్శకాలతో పట్టణ ప్రాంతాల్లోని చెరువులను జీవీఎంసీకి అప్పగించి సుందరీకరణ పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని శాఖాపరంగా తెలిపాం. దీంతో చెరువుల సంరక్షణ జరుగుతుంది. నీటి వనరులు ఆక్రమించుకుని నిర్మించిన చెరువు ఆక్రమణలపై దృష్టి సారిస్తాం.

-ఎం.ఆనందకుమార్, తహసీల్దార్

టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జి తనయుడు వంశీ

టీడీపీ కార్యకర్తలకు గండి వంశీ సూచన

వేపగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): పార్టీలో చిన్న చిన్న విభేదాలు ఉన్నా, ప్రతీ ఒక్కరూ టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని తెదేపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి తనయుడు వంశీ పేర్కొన్నారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం రాత్రి గోశాల దరి ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తెలియజేయాలని సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు కూటమి పార్టీల సభ్యులను కలుపుకొని పనిచేయాలని సూచించారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్పొరేటర్ రాపర్తికన్నా మాట్లాడుతూ పార్టీలో కొత్తగా ఇతర పార్టీ సభ్యులను చేర్పించేముందు వార్డు అధ్యక్షుడికి, ఇన్‌చార్జిలకు తెలియజేసి అభ్యంతరాలను అధిగమించి పనిచేయాలని సూచించారు. అనంతరం పాతకమిటీ సభ్యులను కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతం గంగ వరహాలు అధ్యక్షుడిగా ఉన్న కమిటీని కొనసాగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కర్రి నూకరాజు, కర్రి పైడిరాజు, రాపర్తి శైలజ యశస్వి, శోభ తదితరులు పాల్గొన్నారు.

తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి

మల్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని మల్కాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రం భవనంపై ఉన్న సామాజిక భవనంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ జ్యోతిశ్రీ, అనుశ్రావణి ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో బుధవారం రక్తహీనతను అరికట్టడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు ఉండవని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వైద్యాధికారి డాక్టర్ నాన్సీ, మల్కాపురం జీవీఎంసీ ప్రాధానోపాధ్యాయులు పెద్దాడ హరికృష్ణ, సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీలక్ష్మి, కుమారి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్మూలనకు సూచనలు

సింధియా, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 40వ వార్డులో జోన్-5 ప్రజారోగ్య సహాయ వైద్యాధికారి సునీల్ బుధవారం పర్యటించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిశ్రమ వద్ద గల ప్రధాన గెడ్డను, మిగతా గెడ్డలను పరిశీలించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎలా తొలగించాలో పలు సూచనలు చేశారు. వ్యర్థాలు ఎక్కువ ఉన్నట్లు గమనిస్తే వెంటనే ఫోటో తీసి ఆ చిత్రాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తెలియజేయాలని సూచించారు.

యోగాతో ఒత్తిడి దూరం

మల్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): యోగా వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన యోగా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. యోగాను నిత్యజీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, ఉద్యోగ నైపుణ్యాలపై యువజన నాయకులు కృపారాణి, శేషు, రామారావు, సుజన వివరించారు. బాలలు కొత్త ఇంగ్లీష్ పదాలను నేర్చుకున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

పెందుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. చదవడం, రాయడంలో తర్ఫీదు ఇచ్చారు. గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో మళ్లీ రెండు సెల్‌ఫోన్ల కలకలం

ఆరిలోవ, మే 14(ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో గల కావేరి బ్యారెక్స్ వద్ద భూమిలో జరిపిన తవ్వకాలలో రెండు సెల్ ఫోన్లు మంగళవారం లభ్యమైనట్లు జైలు అధికారులు తెలిపారు. దీనిపై బుధవారం ఉదయం ఫిర్యాదు అందినట్టు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ ఇటీవల రాజమండ్రిలో జైలు సూపరింటెండెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల కడప కారాగారంలో తవ్వకాలు జరుపుతుండగా ఒక సెల్ ఫోన్ లభ్యమైనట్టు వెల్లడించారు. అలాగే ఇతర జైళ్లలో కూడా తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో విశాఖపట్నంలో కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు దొరికిన వైనాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ జైలులోని సుమారు 7 ఎకరాల స్థలంలో సుమారు రెండు అడుగుల లోతులో 8 చోట్ల తవ్వకాలు జరిపించారు. ఈ క్రమంలో కావేరి బ్యారెక్స్ సమీపంలో రెండు సెల్‌ఫోన్లు లభించాయి. అందులోని సిమ్‌లను పరిశీలించగా, గత అక్టోబర్‌లో వినియోగించినటట్టు తెలిసింది. మహిళలు ఉండే స్వర్ణముఖి బ్యారెక్స్‌తో పాటు ఏడు బ్యారెక్స్‌లో జైలు సిబ్బందితో ఈ తవ్వకాలు చేపట్టినట్టు తెలిపారు. జైలుకు నవంబరు నెల నుంచి కొత్త సిబ్బంది వచ్చిన తరువాత సెల్‌ఫోన్లు వాడలేదని సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. తాజాగా రెండు సెల్‌ఫోన్లు దొరికిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఈ కారాగారంలో ఇప్పటి వరకు ఆరు సెల్‌ఫోన్లు దొరికినట్టు చెప్పారు.

ఎండ ప్రచండం.. తగ్గిన జనసంచారం


మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్మానుష్యంగా సింహాచలం రైల్వే స్టేషన్ పరిసరాల్లోని దుకాణాలు

గోపాలపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆరుబయట జనసంచారం కానరావడం లేదు. మధ్యాహ్నం నుంచి ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారుతోంది. జనం రాకపోవడంతో దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసేస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయింత్రం 4 గంటల వరకూ రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాలు ఎండదెబ్బకు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పొద్దుపోయాక వ్యాపారాలు కాస్త ఊపందుకుంటున్నాయి. సింహాచలం ప్రాంతంలో బుధవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు, గరిష్ఠ ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఉక్కపోత, తాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండదెబ్బకు శీతల పానీయాలు విక్రయించే దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. ఎండలో బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ శీతలపానీయాలు సేవించడానికి ఎగబడుతుండడంతో చెరకు రసం, షోడా, లస్సీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యాహ్నం వేళలో శీతల పానీయాల దుకాణాల వద్ద మాత్రమే జనం కనిపిస్తున్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి



మేయర్ పీలాకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డులో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, కొత్త పనులకు సహకరించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావును బుధవారం 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అభ్యర్థించారు. ఆయనను కలసి వినతి పత్రం అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ సహకారంతో ఇప్పటికే పలు పనులు పూర్తిచేశామని, గత పాలక మండలి తీరు కారణంగా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని త్వరతగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని కోరారు.

డాబాగార్డెన్స్‌లో విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే

డాబాగార్డెన్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష పాఠశాల విద్యాశాఖ ఆదేశాల ప్రకారం బుధవారం డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో దివ్యాంగ బాలబాలికల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ఏపీసీ జె.చంద్రశేఖరరావు తెలిపారు. కృష్ణాగార్డెన్స్ పరిసర ప్రాంతాలను విద్యాశాఖ అధికారులు, జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.గీత సందర్శించి ప్రభుత్వ పాఠశాలల ద్వారా దివ్యాంగ బాలబాలికలకు కల్పిస్తున్న సదుపాయాలను తెలియజేశామన్నారు. రాయితీలు, భవిత కేంద్రంలో అందిస్తున్న చదువు, ఫిజియోథెరపీ సేవలను, ఉపకార వేతనాలను తల్లిదండ్రులకు వివరించి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రోత్సహించామన్నారు. విభిన్న ప్రతిభావంతులైన పిల్లల క్రీడ, విద్య, సాంస్కృతిక రంగాల్లో సాధిస్తున్న ప్రగతిని తెలియజేశామన్నారు. ఐఈఆర్పీలు శ్వేతలత, ప్రతిమ, ప్రియ పాల్గొన్నారు.

జోన్-4 కార్యాలయంలో నేడు కీలక సమావేశం

అల్లిపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో ఎనిమిది జోన్ల పరిధిలో పరిపాలన సౌలభ్యం కోసం అసెంబ్లీ నియోజకవర్గాల పునఃరూపకల్పన ప్రతిపాదనలో భాగంగా గురువారం ఉదయం సమావేశం నిర్వహిస్తున్నట్లు జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జోన్-4 కార్యాలయంలో దక్షిణ నియోజకవర్గం ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, పౌరుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు.

టీడీపీ సమావేశానికి హాజరు

మురళీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఉత్తర నియోజకవర్గ నాయకులు పలువురు హాజరయ్యారు. నియోజకవర్గాల వారీగా జరిగిన సమావేశంలో వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ సభ్యత్వ నమోదుపై ఆరా తీసినట్లు టీడీపీ నేత వరప్రసాద్ తెలిపారు.

తగ్గిన విద్యార్థులతో ఉపాధ్యాయ పోస్టుల్లో కోత

... 5వ పేజీ తరువాయి

చూపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి విద్యా సంవత్సరంలో వైసీపీ హయాంలో చేపట్టిన సంస్కరణలనే అమలు చేయడంతో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు బడుల వైపు మొగ్గు చూపారు. తాజాగా జారీ చేసిన జీవో నంబర్-21 మేరకు ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ఉత్తర్వుల మేరకు జిల్లాలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి మేరకు టీచర్లను కేటాయించారు. జిల్లాలో ప్రధానంగా చంద్రంపాలెం, తోటగరువు, గాజువాక, నడుపూరు, ఆనందపురం, తదితర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రాథమిక పాఠశాలల విషయంలో కొత్తగా అమలు చేసిన మోడల్, బేసిక్ ప్రైమరీ పాఠశాలలతో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు ప్రయోజనం చేకూరనున్నది. ప్రతి తరగతికి ఒక టీచర్ ఉండేలా మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ హయాంలో 3, 4, 5 తరగతులను సమీపంలో ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన ప్రభావం మొత్తం ప్రాథమిక పాఠశాలలపై పడింది. అనేక ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గడంతో జిల్లాలో పలుచోట్ల పాఠశాలల్లో పది మంది కంటే తక్కువకు విద్యార్థుల సంఖ్య పడిపోయింది. ఈ నేపథ్యంలో కొత్తగా అమలు చేసిన సంస్కరణల మేరకు ప్రాథమిక పాఠశాలలపై ఫోకస్ పెట్టాల్సిన ఆవశ్యకత ఉంది.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

వేపగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): వేపగుంట పైడిమాంబ కాలనీలో నివాసం ఉంటున్న వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పెందుర్తి పోలీసులు తెలిపారు. పైడిమాంబకాలనీలో గాలి గోవింద్(35), భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి 20 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్నారు. అతడు పండ్ల వ్యాపారి. గోవిందరావు సొంతూరు తునిలో అనేక మంది వద్ద అప్పులు తీసుకున్నట్లు సమాచారం. భార్య పార్వతి, పిల్లలతో కలిసి ఊరెళ్లింది. మీ అప్పు తీర్చేస్తానని కొందరికి ఫోన్ చేసి బుధవారం రావాలని చెప్పినట్లు సమాచారం. సాయంత్రం వచ్చిన కొందరికి ఫోన్ ఎత్తకపోవటం, ఇంట్లో తలుపులు వేసి ఉండటంతో చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చారు. కిటికిలోంచి చుడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. దీంతో పెందుర్తి పోలీసులకు సమాచారం ఇవ్వటంతో వారు సంఘటన స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. గురువారం శవాన్ని కుటుంబ సభ్యుల సమక్షంలో కేజీహెచ్‌కు తరలిస్తామని కేసు దర్యాప్తు జరుపుతున్న పెందుర్తి పోలీసులు తెలిపారు.

ఎర్నిమాంబ జాతర మహోత్సవానికి ఏర్పాట్లు



అల్లిపురంలో పుష్పాలంకారంలో ఎర్నిమాంబ అమ్మవారు



జాతర మహోత్సవానికి పందిరిరాట వేస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ అర్ధాంగి పద్మజ తదితరులు



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

జ్ఞానాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం అచ్చియ్యమ్మపేట గ్రామస్థుల ఇలవేల్పు, సంతాన దేవతగా పూజలందుకునే ఎర్నిమాంబ అమ్మవారి జాతర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.శనివారం తొలేళ్ల, ఆదివారం ప్రధాన పండుగ నిర్వహిస్తారు. ఎనభై ఏళ్ల క్రితం ఆవిర్భవించిన అమ్మవారు అచ్చియ్యమ్మపేట గ్రామస్థుల కోర్కెలు తీర్చే తల్లిగా పేరొందారు. సంతానం లేని వారు అమ్మవారిని వేడుకుంటే పిల్లలు పుడతారని భక్తుల విశ్వాసం. ఇందుకోసం ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. గతంలో స్థానిక భక్తుల అజమాయిషీలో ఆలయం నడిచేది. భక్తుల తాకిడి, ఆదాయం పెరగడంతో ఆలయాన్ని దేవదాయ శాఖలో విలీనం చేశారు. గత ఏడాది విశాఖ డెయిరీ ఆర్థిక సహాయంతో ఆలయాన్ని పునరుద్ధరించారు. అప్పటి నుంచి ఈవో పర్యవేక్షణలో ఆలయం కొనసాగుతోంది. ఏటా మే నెల మూడో ఆదివారం అమ్మవారి ప్రధాన పండుగ చేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా బుధవారం పందిరిరాట ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అర్ధాంగి పద్మజ పాల్గొన్నారు. అమ్మవారి సన్నిధిలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురువారం జ్ఞానాపురం గ్రామ ప్రజల సహకారంతో నీలధార కార్యక్రమం, శనివారం తొలేళ్ల నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు.ఈ ఉత్సవం పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి నుంచి ప్రారంభమై కొబ్బరితోట, అచ్చియ్యమ్మపేట మీదుగా ఆలయం వరకు అమ్మవారి ప్రతిమల ఊరేగింపు జరుగుతుందన్నారు. జాతర రోజు అమ్మవారికి పుష్పాలంకరణ చేస్తామన్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, పెద్ద సంఖ్యలో హజరయ్యే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.

ఎరుకుమాంబకు నూతన వస్త్రాల సమర్పణ

దొండపర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తిలో ఎరుకుమాంబ అమ్మవారిని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అర్ధాంగి పద్మజ బుధవారం దర్శించుకొన్నారు. ఆమె అమ్మవారికి జలాభిషేకం చేసి నూతన వస్త్రాలను సమర్పించారు. 27వ వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావు బుజ్జి, ఆలయ ఈవో రమాభాయి ఆమెకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 27, 42 వార్డుల టీడీపీ, బీజేపీ అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, కన్నం గురుగోవింద్, నాయకులు వి.లక్ష్మీశివప్రసాద్, మజ్జి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

అంకితభావంతో పని చేయండి : కలెక్టర్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను అంకితభావంతో నిర్వహించాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై బుధవారం సాయంత్రం ఆయన తన ఛాంబర్ నుంచి జిల్లాలోని అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజెండాలో పేర్కొన్న అంశాలను క్షేత్రస్థాయిలో చేపట్టాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా మెగా క్లీనింగ్ డ్రైవ్ చేపట్టాలని చెప్పారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, చర్చిలు. మసీదులు, పార్కులు, బస్, రైల్వేస్టేషన్లు, వసతి గృహాలు, ఆస్పత్రులు, తదితర ప్రాంతాల్లో ప్రతి మూడో శనివారం పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పర్యాటక ప్రాంతాల్లో పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. ఆస్పత్రులు, విద్యా సంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సీపీవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు. టెర్రస్ గార్డెన్, తడి, పొడి చెత్త సేకరణ, ప్రజా మరుగుదొడ్ల వినియోగంపై సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కార్మికులను ఎండల నుంచి ఆదుకోండి



మాట్లాడుతున్న జేసీఎల్ రామారావు

అక్కయ్యపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక శాఖ సంయుక్త కమిషనర్ (జేసీఎల్) ఎం.రామారావు సూచించారు. అక్కయ్యపాలెంలోని కార్మికశాఖ కార్యాలయంలో బుధవారం సాయంత్రం పరిశ్రమల యజమానులకు అవగాహన కల్పించారు. కార్మికుల ఆరోగ్యం, భద్రతను కాపాడేందుకు పరిశ్రమల యజమానులు పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు. కార్మికులకు పాదరక్షలు, టోపీలు సమకూర్చాలని సూచించారు. సీఎస్సార్ ఫండ్ కింద సంస్థ ఆవరణలో ఉచితంగా మజ్జిగ, తాగునీటి సదుపాయం కల్పించాలన్నారు. విజయ విశాఖ మిల్క్ ప్రొడ్యూసర్స్ లిమిటెడ్ (గాజువాక), లారస్ ల్యాబొరేటరీస్ సంస్థ (పరవాడ)ల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో శతశాతం ఉత్తీర్ణత



హరిచందన గరికిన (పదో తరగతి)



కె.దీక్షిత (ప్లస్-2)

కంచరపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ బోర్డు పరీక్షల్లో 104 కేంద్రీయ విద్యాలయం-1 విద్యార్థులు ప్రతిభ చూపారు. సీబీఎస్ఈ పది, పన్నెండు తరగతుల పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ జి.కిశోర్ పేర్కొన్నారు. తమ కేవీలో పదోతరగతిలో గరికిన హరిచందన 488/500 మార్కులతో ప్రథమ స్థానం పొందగా, మోనమ్ దాస్ 480 మార్కులతో ద్వితీయ స్థానం సాధించారన్నారు. పన్నెండో (ప్లస్-2) తరగతి పరీక్షల్లో హ్యూమనటీస్ స్ట్రీంలో కె.దీక్షిత (485/500) ప్రథమ స్థానం, వేమూరి శ్రీ హిమజ, సౌమ్యశర్మ (474/500) మార్కులతో ద్వితీయ స్థానం, సైన్స్ స్ట్రీంలో కె.నూతన శ్రీమనోజ (465/500) ప్రథమ స్థానం, ఆర్.సూర్య (454/500) మార్కులు వచ్చాయన్నారు. పది, పన్నెండు తరగతుల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించినట్టు కిశోర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అధ్యాపకులను ప్రిన్సిపాల్ అభినందించారు.

జీవీఎంసీ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం



నగదు చెక్కు అందిస్తున్న ఎం.వెంకటరావు, బీజేపీ నాయకులు, ప్రధానోపాధ్యాయిని

మాధవధార, మే 15 (ఆంధ్రజ్యోతి): మాధవధార హైస్కూలు విద్యార్థులకు బుధవారం బీజేపీ నాయకులు నగదు ప్రోత్సాహం అందించారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 580 మార్కులు దాటిన 8 మంది జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు రూ.2 వేల చొప్పున నగదు అందించారు. ప్రధానోపాధ్యాయిని బి.హేమలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి టి.పద్మ, నాయకులు విజయచంద్రుడు, ఎస్.దిలీప్, ఎం.వెంకటరావు, కె.వెంకట్, సత్య పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయిని బి.హేమలతకు నాయకులు శాలువా సత్కారం జరిపారు. ఫలితాల సాధనకు ఆమె చేసిన కృషిని కొనియాడారు.

కొనుగోలు చేసిన తులంన్నర బంగారం ఆటోలో మాయం

పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

సీతంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): మారికవలసకు చెందిన రోహిణి అనే మహిళ నగరంలోని ఓ నగల దుకాణంలో బుధవారం తులంన్నర బంగారం కొనుగోలు చేసి ఆటో ఎక్కింది. అప్పటికే ఆ ఆటోలో ఓ మహిళ కూర్చుని ఉంది. ఇద్దరూ ప్రయాణించిన తరువాత డైమండ్ పార్క్ దగ్గరకు వచ్చేసరికి ఆ మహిళ ఆటో నుంచి దిగిపోయింది. రోహిణి మరికొంత దూరం వెళ్లి పర్సు చూసుకోగా కొనుగోలు చేసిన తులంన్నర బంగారం కనిపించలేదు. ఉలిక్కిపడి లబోదిబోమంటూ ఆమె నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆ చెట్లను కూల్చేయండి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు సమస్య వివరిస్తున్న కార్పొరేటర్ పద్మరెడ్డి

సీతమ్మధార, మే 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో నక్కవానిపాలెం ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో కుళ్లిపోయిన మొదళ్లతో ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేటర్ సాడి పద్మరెడ్డి వార్డులో సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. చెట్ల కింద కొందరు మద్యం తాగుతున్నారని, కొన్ని చెట్ల మొదళ్లు కూడా కుళ్లిపోయి ఏక్షణమైనా కూలిపోయే స్థితిలో ఉన్నందున వాటిని తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. ఆ చెట్లను తొలగిస్తే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు వినియోగించినవారికి జరిమానా



ప్లాస్టిక్ సంచుల వాడకంపై పూల వ్యాపారులను హెచ్చరిస్తున్న సిబ్బంది

సీతమ్మధార, మే 14 (ఆంధ్రజ్యోతి): వద్దని వారించినా ప్లాస్టిక్ సంచులు వాడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానాలు విధిస్తామని జీవీఎంసీ అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్ హెచ్చరించారు. ప్లాస్టిక్ సంచుల వినియోగంపై జోన్-3 పరిధిలో సీతమ్మధార రైతుబజార్, మద్దిలపాలెం తదితర ప్రాంతాల్లో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొందరు వ్యాపారులు ప్లాస్టిక్ సంచులు వాడుతుండటంతో సీజ్ చేసి జరిమానాలు విధించారు. జీవీఎంసీ ఎస్ఎస్ సత్యనారాయణ, శానిటేషన్ సెక్రటరీలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, రైతుబజార్ ఎస్టేట్ అధికారి కృష్ణమూర్తి, రైతులు పాల్గొన్నారు.

పాలీసెట్‌లో తిరుమల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షా ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో గల తిరుమల విద్యార్థులు ప్రతిభ చాటారు. 120 మార్కులకుగాను 120 మార్కులు ఆరుగురు విద్యార్థులు బాలినేని కళ్యాణ్‌రామ్, ఊన్న వరుణ్ తేజ్, ఆకుల నిరంజన్, శ్రీరామ్, బల్లా రిషీత, వి.స్వప్న, రూపిటి చన్నా, పాల రోహన్ సాధించార న్నారు. 119మార్కులు 13 మంది విద్యార్థులు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు తెలిపారు. రాష్ట్రస్థాయిలో 2, 5, 7, 10, 11, 12 ర్యాంకులు సాధించడంతోపాటు 50 లోపు 14మంది, 100లోపు 23 మంది, 500 లోపు 79మంది విద్యార్థులు సాధించార న్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్‌లు అభినందించారు.

కల్యాణ మండపం శ్లాబ్ కూలి ఐదుగురికి గాయాలు

సీతంపేట, మే 14 (ఆంధ్రజ్యోతి): దొండపర్తి మండావారి వీధిలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో బుధవారం రాత్రి 11 గంటల సమయంలో శుభకార్యక్రమం విందు జరుగుతుండగా శ్లాబ్ కూలి ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ముగ్గురికి తీవ్ర గాయాలైనట్లు నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ తెలిపారు. విందు ఆరగిస్తుండగా ఫ్యాన్ వద్ద శ్లాబ్ కూలిపోవడంతో బాలకృష్ణ, శంకర్ అనే వ్యక్తుల తలపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అలాగే బాలరాజు అనే వ్యక్తి చేతి వేళ్లకు గాయాలయ్యాయి. మరో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం తెలిసిన వెంటనే నాలుగో పట్టణ సీఐ సత్యనారాయణ సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

నేటి నుంచి ఏడు అదనపు సర్వీసులు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : ద్వారకా కాంప్లెక్సు నుంచి దూర ప్రాంతాలకు 3, నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు 4 అదనపు సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం నిర్ణయించింది. విశాఖ నుంచి అమలాపురానికి ప్రతి 40 నిమిషాలకు ఒక షెడ్యూల్ బస్సు ఉంది. కానీ ఈ రూట్‌లో ప్రయాణికుల డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ఉదయం 8.45 గంటలకు మరో అదనపు సర్వీసు నడపనున్నారు. ద్వారకాబస్‌స్టేషన్ నుంచి కాకినాడకు ప్రతి 20 నిమిషాలకు ఒకటి చొప్పున షెడ్యూల్ సర్వీసులు ఉన్నప్పటికీ ప్రయాణికుల డిమాండ్ దృష్ట్యా ఉదయం 5.15 గంటలకు, సాయంత్రం 4.15 గంటలకు అదనపు సర్వీసులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే నగరంలోని గాజువాక, ద్వారకాబస్‌స్టేషన్, సింహాచలం, పెందుర్తి ప్రాంతాల నుంచి ఐటీ పార్కుకు నాలుగు అదనపు బస్సులు నడపనున్నారు. గురువారం ఉదయం నుంచి అదనపు సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ విశాఖ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు.

19 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఆరిలోవ, మే 14 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 19 నుంచి పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. వీటితో పాటు ఓపెన్ స్కూలు పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా నిర్వహిస్తామని పేర్కొన్నారు. రెగ్యులర్ వారికి జిల్లా వ్యాప్తంగా 27 కేంద్రాల్లో ఈ నెల 19 నుంచి 28వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు జరుగుతాయని తెలిపారు. అన్ని ఏర్పాట్లు చేశామని, విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 19 నుంచి 24వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్షలు జరుగుతాయని ఓపెన్ స్కూలు సొసైటీ సంచాలకులు నరసింహారావు తెలిపారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఉదయం 9-30 నుంచి 12-30 వరకు జరుగుతాయని తెలిపారు. 9 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెనప్ టెన్త్ పరీక్షలకు 640 మంది విద్యార్థులు, 5 కేంద్రాల్లో నిర్వహించనున్న ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 814 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు.

ఎయిడెడ్ ఫ్యాకల్టీపై కీలక నిర్ణయం

ఏయూ నుంచి వెనక్కి పంపేందుకు లేఖ రాస్తానన్న వీసీ జీపీ రాజశేఖర్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా యూనివర్సిటీలో ఎయిడెడ్ కాలేజీల నుంచి వచ్చి ఫ్యాకల్టీగా కొనసాగుతుండడంపై గడిచిన కొన్నేళ్ల నుంచి రచ్చ జరుగుతోంది. ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపించాలంటూ వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు, ఇతర అధికారులు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఏయూ అధికారులకు కూడా కాలేజీయేట్ కమిషనర్ నుంచి మూడుసార్లు లేఖలు కూడా వచ్చినట్టు చెబుతున్నారు. ఎయిడెడ్ ఫ్యాకల్టీని కొనసాగిస్తారా.. వెనక్కి పంపిస్తారా.? అని వచ్చిన లేఖలపై వర్సిటీ అధికారులు ఇప్పటివరకు సమాధానం కూడా చెప్పలేదు. కాలేజీయేట్ కమిషనర్ నుంచి ఏయూ అధికారులకు వచ్చిన లేఖల విషయాన్ని కొందరు వీసీ జీపీ రాజశేఖర్ దృష్టికి తీసుకువెళ్లడంతో బుధవారం ఆయన కీలక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వర్సిటీలోని వివిధ కాలేజీల ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, డీన్లతో నిర్వహించిన సమావేశంలో ఎయిడెడ్ ఫ్యాకల్టీని ఏం చేద్దామని ప్రశ్నించారు. దీనిపై వారంతా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వర్సిటీ నుంచి వారిని వెనక్కి పంపాలన్న అభిప్రాయాన్ని దాదాపు అందరూ వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీనిపై వీసీ స్పందిస్తూ వారిని వెనక్కి పంపించేలా లెటర్ రాస్తానని చెప్పినట్టు సమాచారం. ఈ మేరకు ఒకటి, రెండు రోజుల్లో ఆయన లేఖ రాసే అవకాశం ఉంది.

ఇదిలావుండగా కాలేజీయేట్ కమిషనర్ నుంచి వచ్చిన లేఖల విషయాన్ని తనకు చెప్పకపోవడంపైనా వీసీ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు తెలిసింది. తనకు తెలియకపోవడం వల్లే దీనిపై నిర్ణయం తీసుకోలేకపోయానని ఆయన చెప్పినట్టు పలువురు చెబుతున్నారు. అయితే ఒక సీనియర్ ప్రొఫెసర్ ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లడం వల్లే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఏదిఏమైనా ఎయిడెడ్ ఫ్యాకల్టీని వెనక్కి పంపేందుకు వీసీ నిర్ణయం తీసుకోవడంతో ఏయూ అధ్యాపకుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

నగర అభివృద్ధికి సహకరించండి

సీఎం చంద్రబాబుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర అభివృద్ధికి సహకరించవలసిందిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు మేయర్ పీలా శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మేయర్‌గా ఎన్నికైన తరువాత తొలిసారిగా ఆయన బుధవారం అమరావతిలో సీఎంను పలువురు ప్రజాప్రతినిధులు, నేతలతో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీలా శ్రీనివాసరావును చంద్రబాబునాయుడు అభినందించారు. గత మేయర్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టడంతోపాటు అవిశ్వాసం నెగ్గేలా చేయడానికి కృషి చేసిన మేయర్ పీలా శ్రీనివాసరావు, ఎంపీలు, కూటమి ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లను సీఎం అభినందించారు. మేయర్‌గా నగరాభివృద్ధికి కృషి చేయాలని పీలాకు సూచించారు. కార్పొరేటర్లు, కూటమి ప్రజాప్రతినిధులను కలుపుకుంటూ పాలన సాగించాలన్నారు. మేయర్ బాధ్యతలు చేపట్టాక ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణపై విశేషంగా కృషి చేస్తున్నారంటూ పీలా శ్రీనివాస్‌ను అభినందించారు. చంద్రబాబును కలిసినవారిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన నగర అధ్యక్షుడు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, ఏపీయూఎఫ్ఐడీసీ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఉన్నారు.

డిప్యూటీ మేయర్ ఎంపిక నిర్ణయం మీదే..

... 5వ పేజీ తరువాయి

పలువురు ఆశిస్తుండడంతో దీనిపై కూడా సీఎం చంద్రబాబుతో చర్చించేందుకు నగరానికి చెందిన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పి.విష్ణుకుమార్‌రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, టీడీపీ ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి దామచర్ల సత్య, తదితరులు అమరావతి వెళ్లి ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన వద్ద డిప్యూటీ మేయర్ పోస్టుకు పలువురు పోటీ పడుతున్నారని, యాదవ, కాపు సామాజిక వర్గాలకు చెందిన కూటమి కార్పొరేటర్ల నుంచి తీవ్రమైన పోటీ నెలకొన్నట్టు మేయర్, ప్రజాప్రతినిధులు వివరించారు. 'వీరిలో ఎవరిని ఎంపిక చేస్తారో నిర్ణయం మీదే' అని చంద్రబాబుకు చెప్పగా.. అందుకు ఆయన స్పందిస్తూ స్థానిక రాజకీయ, సామాజిక సమీకరణాలను బేరీజు వేసుకుని, కూటమి పార్టీలకు నష్టం వాటిల్లకుండా, ప్రజల నుంచి వ్యతిరేకత రాకుండా ఉండేలా కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, సీనియర్ నేతలంతా కూర్చుని ఏకాభిప్రాయంతో డిప్యూటీ మేయర్ అభ్యర్థిని ఎంపిక చేసుకోవాలని సూచించినట్టు తెలిసింది. దీంతో డిప్యూటీ మేయర్ ఎంపిక మళ్లీ నగర ప్రజాప్రతినిధుల కోర్టులోకి వచ్చినట్టయింది. దీంతో సీఎం సమక్షంలో డిప్యూటీ మేయర్ ఎవరనే దానిపై పంచాయితీ తేలిపోతుందని భావించిన ఆశావహుల్లో ఇంకా ఉత్కంఠ కొనసాగుతోంది.

మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.6,100 కోట్ల ప్రైవేటు రుణం

... 5వ పేజీ తరువాయి

అవసరం అవుతుందని, ప్రైవేటు భూములకు చెల్లించడానికి రూ.882 కోట్లు కావాల్సి ఉంటుందని లెక్కలు వేశారు. ఢిల్లీ వెళ్లినపుడల్లా దీనిపై చర్చలు జరిపారు. అక్కడ ఏమైందో తెలియదు గానీ తాజాగా మెట్రో రైలు కార్పొరేషన్ ఎండీ రామకృష్ణారెడ్డి బుధవారం అమరావతిలో ప్రైవేటు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి విశాఖతో పాటు అమరావతి మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు తక్కువ వడ్డీతో రుణసాయం చేయాలని కోరారు. విశాఖ ప్రాజెక్ట్‌కు రూ.6,100 కోట్లు రుణంగా అవసరం అవుతుందని ప్రతిపాదించారు. ఈ సమావేశానికి ఏడీబీతో పాటు ఇంకా అనేక బ్యాంకులు హాజరయ్యాయి. పీపీపీ విధానంలో ప్రైవేటు బ్యాంకులు రూ.6,100 కోట్లు సమకూరిస్తే మిగిలిన మొత్తం రూ.5,398 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. ఇది కాకుండా భూ సేకరణకు అవసరమైన మొత్తం రూ.882 కోట్లు ఏపీ ప్రభుత్వం సమకూర్చుకోవాలి. అప్పుడే ఈ ప్రాజెక్టు పట్టాలపైకి వస్తుంది.

కేజీహెచ్‌లో తాగునీటి కష్టాలు!

... 5వ పేజీ తరువాయి

ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. దీంతో బాత్రూమ్‌కు వెళ్లాలంటేనే భయమేస్తోందని, అక్కడ దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని రాజేంద్రప్రసాద్ వార్డులో చికిత్స పొందుతున్న రోగి సహాయకుడు నాయుడు తెలిపారు. ఆస్పత్రిలో తాగునీరు లభ్యం కాకపోవడంతో రెండు రోజుల నుంచి బయటే వాటర్ బాటిళ్లను కొనుగోలు చేస్తున్నామని, నీటి సమస్య వేసవిలో ఉత్పన్నమవుతుందని తెలిసినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని డి.వెంకటరావు అనే రోగి సహాయకుడు పేర్కొన్నారు. కాగా కార్డియాలజీ విభాగం వద్దనున్న ఆర్వో ప్లాంట్ వద్ద నీరు రాకపోవడం మాట పక్కన పెడితే దానిని ముట్టుకుంటేనే కరెంట్ షాక్ కొడుతుందని పలువురు రోగుల సహాయకులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆస్పత్రి ఉన్నతాధికారులు స్పందించి నీటి ఇబ్బందులను తొలగించేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టాలని రోగులతో పాటు వారి సహాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరఫరా ఏదీ?

కేజీహెచ్‌లోని వార్డులు, నర్సింగ్ కాలేజీ, హాస్టళ్లతో పాటు అధికారుల చాంబర్స్‌కు అవసరమయ్యే నీటిని జీవీఎంసీ సరఫరా చేస్తుంది. రోజువారీ అవసరాల కోసం కేజీహెచ్‌కు 500 నుంచి 600 కిలోలీటర్ల నీరు అవసరం అవుతుంది. ఈ నీటి సరఫరా కోసం కేజీహెచ్‌లో ఐదుచోట్ల నీటిని నిల్వ చేసే సంపులు ఉన్నాయి. ఈ సంపులకు రెండు మార్గాల ద్వారా జీవీఎంసీ నీటిని సరఫరా చేస్తుంది. ఈ మేరకు నీటిని సరఫరా చేయకపోవడం వల్లే సమస్యలు ఎదురవుతున్నట్టు పలువురు పేర్కొంటున్నారు.

నేడు దుర్గమాంబ జాతర

» భారీ ఎత్తున ఏర్పాట్లు



అగనంపూడి మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 85వ వార్డు ఏడుమెట్ల మర్రిపాలెం గ్రామ ప్రజల ఆరాధ్య దేవత దుర్గమాంబ జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నారు. ఈ జాతర కోసం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామంలో విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. ఆలయం నుంచి ప్రధాన రహదారుల వరకు భారీ ఎత్తున విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. గ్రామంలో పూర్తి స్థాయిలో విద్యుత్ కాంతులీనుతున్నాయి. జాతర సందర్భంగా ఉత్సవ కమిటీ, యువజన సంఘాల ఆధ్వర్యంలో పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రకాల సాంస్కృతిక ప్రదర్శనలు చేసేందుకు వేదికలను ఏర్పాటు చేశారు.

ఉత్సవాల్లో భాగంగా బుధవారం జోడి ఘటాల జాతర, కోటి దీపాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించి పూజలు చేశారు. అంతకుముందు మహిళలు వివిధ రకాల పిండి వంటలను తయారు చేసి అమ్మవారికి సారెగా గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దుల్ల లక్ష్మీ రామునాయుడు, దుల్ల చెల్లారావు, వరం బాబు, రామారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దుర్గమాంబ అనుపోత్సవం

పెదగంట్యాడ, మే 14(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం లో తొమ్మిది రోజుల పాటు జరిగిన దుర్గమాంబ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో ముగియనున్నాయి. సీతానగరం గ్రామాభ్యుదయ సేవా సంఘం ఈ ఉత్సవాల నిర్వహణకు సారథ్యం వహిస్తున్నది. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు, దర్శనాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు చేపట్టారు. మేళతాళాలు, నేల వేషాలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి ఊరేగింపు జరుగనుంది. రాత్రికి సీతానగరం ప్రాథమిక పాఠశాల గ్రౌండ్‌లో డ్యాన్స్ బేబీ డ్యాన్స్ నిర్వహించారు. సీతానగరం గ్రామాభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు నంబారు సింహాద్రి, కార్యదర్శి మొల్లి సింహాద్రి, కార్యవర్గం సభ్యులు నమ్మి అప్పారావు, నక్క వెంకటరమణ, నమ్మి అప్పలనాయుడు, చట్టి సింహాచలం ఈ కార్యక్రమాలనిర్వాహణకు సారథ్యం వహిస్తున్నారు.

నారా లోకేశ్‌ను కలసిన కార్పొరేటర్ గోవిందరెడ్డి



అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో బుధవారం రాష్ట్ర విద్యాశాఖ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను 69 వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలో చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలతో పాటు గాజువాక నియోజకవర్గంలో నిర్వహిస్తున్న పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను లోకేశ్‌కు వివరించినట్టు గోవిందరెడ్డి తెలిపారు.

సినిమా గైడ్

● **సింగిల్** : మెలోడి, శరత్, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సప్తగిరి (తగరపువలస)

● **శుభం**: శారద, శ్రీకన్య, కిన్నెర, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), గణేష్ (తగరపువలస)

● **హిట్** : జగదాంబ, సంగం, శ్రీరామ, శ్రీలీలామహల్, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 18, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 42, బెండకాయలు 22, పచ్చిమిర్చి 22, కాకరకాయలు 40, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 16, క్యారెట్ 38 దొండకాయలు 24, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)9, మునక్కాడలు (కిలో) 60, అల్లం (పాతది)48, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 44, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 48, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 30 చిలగడదుంపలు 34, కంద 84, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 160, కొండ ఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట)20, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట)3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ30, కర్ర పెండలం 18, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

» అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్



ధర్నా నిర్వహిస్తున్న ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : క్రమశిక్షణ పేరుతో ఉక్కు ఉద్యోగులపై సస్పెన్షన్, షోకాజు నోటీసులు ఇచ్చిన యాజమాన్యం వీటిని తక్షణమే విరమించుకోవాలని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు షోకాజు నోటీసులు, సస్పెన్షన్ ఇవ్వడాన్నినిరసిస్తూ బుధవారం ప్లాంటు ప్రధాన పరిపాలన భవనం మార్గంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ నాయకులు మాట్లాడుతూ ప్లాంటు యాజమాన్యం నియంతృత్వాన్ని ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. కార్మిక హక్కులను కాలరాస్తూ.. కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఆరోపించారు. కార్మిక వర్గాన్ని భయభ్రాంతులకు గురిచేసే చర్యలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఉద్యోగులపై దాడులు, వేధింపులకు దిగితే వారి ఆత్మస్థైర్యం దెబ్బ తింటుందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆ ప్రభావం ప్లాంటు ఉత్పత్తిపై పడుతుందన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కేఎస్ఎన్ రావు, జె.అయోధ్యరాం, డి.ఆదినారాయణ, వీవీ రమణమూర్తి, రామస్వామి, వైటీ దాసు, రామ్‌కుమార్, డీవీ రమణారెడ్డి, బొడ్డు పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

అరుదైన చికిత్స చేసి చిన్నారిని కాపాడిన కిమ్స్ ఐకాన్ వైద్యులు

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే తిరగబడిన మూత్రపిండంతో తీవ్ర అనారోగ్య సమస్యతో బాధ పడుతున్న మూడేళ్ల చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు అరుదైన శస్త్ర చికిత్స చేసి పునర్జన్మ అందించారు. నగరానికి చెందిన మూడేళ్ల బాలిక తీవ్ర మైన ఇన్ఫెక్షన్‌తో అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు.బాలిక పుట్టుకతోనే మూత్రపిండం తిరగబడి ఉండడంతో మూత్రనాళాలలో అడ్డంకి ఏర్పడి ఇన్ఫెక్షన్‌లు సోకాయి. బరువు తగ్గడం, కడుపు నొప్పి వంటి తీవ్ర సమస్యలు ఎదురవుతున్నట్టు యూరాలజీ నిపుణుడు డాక్టర్ అభిరామ్ కుచ్చర్లపాటి గుర్తించారు. చిన్నారికి అరుదైన లాపరోస్కోపిక్ పైలోప్లాస్టీ అనే సూక్ష్మ శస్త్ర చికిత్స చేశారు. దీంతో చిన్నారి తక్కువ నొప్పితో త్వరగా కోలుకోవడం జరిగిందని వైద్యుడు అభిరామ్ తెలిపారు. చిన్నారికి పునర్జన్మ ఇచ్చిన వైద్య బృందాన్ని చిన్నారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

16, 17 తేదీల్లో 8వ జోన్‌లో తాగునీటి సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ పరిధిలో పలు ప్రాంతాలకు ఈ నెల 16, 17 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ప్రధాన వనరులైన తాటిపూడి మంచినీటి సరఫరా చేసే పథకం 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్‌లైను రాయ్‌పూర్ నుంచి సబ్బవరం నేషనల్ హైవే నిర్మాణ పనులు భాగంగా, అమృత్-2.0, 24/7 వాటర్ సప్లై సిస్టం నెట్‌వర్క్ అభివృద్ధిలో భాగంగా పాపయ్యరాజుపాలెం, పురుషోత్తపురం, వేపగుంట ప్రాంతాల్లో వాటర్ ఫ్లో మీటర్స్ అమర్చుట కోసం 24 గంటలు తాటిపూడి ప్రధాన పైపులైన్ నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. ఉత్తరాపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ సమీపంలో తాటిపూడి 900 ఎంఎం వ్యాసం గల ఎంఎస్ పంపింగ్ పైప్ లైన్ రీరూటింగ్ పనులు చేయు నిమిత్తం ఈ నెల 16న ఉదయం 11.30 గంటలు నుంచి 17వ తేదీ ఉదయం 11.30 గంటల వరకు మంచి నీటి సరఫరా పూర్తిగా నిలిపి వేయనున్నట్టు తెలిపారు. తాటిపూడి ప్రధాన పైప్‌లైన్ పైన ఉన్న బల్క్ ఇండస్ట్రీస్ వినియోగదారులకు, జోన్-8 పరిధిలో ఉన్న వార్డు-93(పి) నుంచి వార్డు 98లో ఉన్న సాయిదుర్గానగర్, దుర్గానగర్, కృష్ణా నగర్, అప్పలనరసింహం కాలనీ, వెంకట సాయి నగర్, బంట కాలనీ, రవి నగర్, లక్ష్మీపురం, పోర్టు కాలనీ, రామ కో-ఆపరేటివ్ కాలనీ, హెచ్‌బీకాలనీ, గోకుల్దాం కాలనీ, రెల్లివీధి, కృష్ణరాయపురం, గొల్లివిల్లివానిపాలెం, ఎల్ఐసీ కాలనీ, సుజాతనగర్, పాపయ్యరాజుపాలెం, పెందుర్తి పాత గ్రామం, తెలకలవీధి, జెడ్పీహెచ్ఎస్ ఏరియా, ప్రశాంతి నగర్, క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే కాలనీ, ప్రశాంతి నగర్, సావిత్రి నగర్, అప్పన్నపాలెం, సింహపురి లేఅవుట్, అడివివరం, ఎస్సీ కాలనీ, పాత అడివివరం, అడివివరం, తదితర ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

ఈ ప్రాంతాల్లో ట్యాంకర్లద్వారా మంచి నీటి సరఫరా చేయడం జరుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు. కాబట్టి నగర ప్రజలు సహకరించాలని కార్యనిర్వాహక ఇంజనీరు మురళీకృష్ణ ప్రకటనలో పేర్కొన్నారు.

ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే చర్యలను ఉపసంహరించుకోవాలి

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తున్నఉద్యోగులకు యాజమాన్యం షోకాజు నోటీసులు ఇవ్వడం, సస్పెన్షన్ చేయడం సరికాదని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రీజనల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ)కు ఉక్కు గుర్తిపు యూనియన్ నేతలుబుధవారం లేఖ రాశారు. సంస్థకు, ఉత్పత్తికి ఎటువంటి నష్టం కలగకుండా ఉద్యోగులు ఒక చోట చేరి చర్చించుకుంటే దీనిని యాజమాన్యం తీవ్రంగ పరిగణించటం సరికాదన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నలుగురు ఉద్యోగులను సస్పెండ్ చేయటం తగదని, దీనిపై స్పందించాలని కోరారు.

సమ్మెకు కార్మిక సంఘాలు సిద్ధం


చర్చిస్తున్న కార్మిక సంఘాల నేతలు

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణతో పాటు కార్మిక హక్కుల రక్షణ కోసం ఈనెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెను బెల్ హెచ్‌పీవీపీలో విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాలు తీర్మానించాయి. బెల్ టౌన్‌షిప్‌లో బుధవారం కర్మాగారంలోని గుర్తింపు యూనియన్‌తో పాటు అన్ని కార్మిక సంఘాలు సమావేశమై సమ్మె విజయవంతం గురించి చర్చించాయి. ఈనెల 20న నిర్వహించనున్న సమ్మెను విజయవంతం చేసిన నాడే కేంద్ర ప్రభుత్వానికి కార్మికులు తమ ఐక్యతను చాటగలరని అన్నారు. సమావేశంలో కార్మిక నాయకులు శుబాకర్ సాహు, బొండా బాబురావు, కొల్లి దేముడు, జీటీపీ ప్రకాశ్, సీతంనాయుడు, ఎ.అప్పారావు, పి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకి అంతరాయం

అక్కిరెడ్డిపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి) :బీహెచ్‌పీవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోగల మింది, తుంగ్లాం, అక్కిరెడ్డిపాలెం, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ 11 కేవీ విద్యుత్ పీడర్ల పరిధిలో ఈనెల 16న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా మింది, అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, పంతులుగారి మేడ, దశమికొండ, పంచవటి టౌన్‌షిప్, విశాల్‌మార్ట్ ఏరియా, బీహెచ్‌పీవీ టౌన్‌షిప్ ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకు విద్యుత్ సరఫరాలోఅంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

తిరుమల నగర్‌లో స్వచ్ఛ భారత్


పార్కును శుభ్రం చేస్తున్న కాలనీ వాసులు

కూర్మన్నపాలెం,మే 14 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత వల్ల అంటురోగాలు దరికి చేరవని తిరుమల నగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం,విశ్వేశ్వరరావు అన్నారు. జీవీఎంసీ 87వ వార్డు తిరుమల నగర్ కాలనీలో అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కాలనీలో నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంకుడు గుంతలు, వాకింగ్ పార్కు, ఓపెన్ జిమ్ తదితర ప్రాంతాలలో చెత్తా చెదారం,పిచ్చి మొక్కలను తొలగించారు. రహదారులను చీపుర్లతో శుభ్ర పరిచారు.ఈ కార్యక్రమంలో పరమానందం,పరమేశ్వరరావు,చంద్ర శేఖర్, సన్యాసిరావు,మహేష్,వర్మ,వసంత రెడ్డి,భాస్కర రావు,శ్రీనివాస్,చంద్ర శేఖర్,రమణ, అర్జున్,భాస్కరరావు తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో సమావేశాలు నిర్వహిస్తే చర్యలు

» మరోసారి ఉత్తర్వులు జారీ చేసిన యాజమాన్యం

ఉక్కుటౌన్‌షిప్, మే 14 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కార్మిక సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని యాజమాన్యం హెచ్చరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌లోని పని ప్రదేశం వదిలి వెళ్లరాదని, అలా కాకుండా నిబంధనలను ఉల్లంఘించి వెళితే చర్యలు తీసుకునేందుకు యాజమాన్యం వెనకడుగు వేయడం లేదు. ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా ప్లాంట్‌లో ప్రచారాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో యాజమాన్యం బుధవారం మరోసారి సర్క్యులర్ ఇచ్చింది. పని సమయంలో పని ప్రదేశం వదిలి వెళ్లరాదని, ఎటువంటి సమావేశాలు, సభలు నిర్వహించరాదని, పాల్గొనరాదని పేర్కొంది. ఇందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కంపెనీ నిబంధనల మేరకు చర్యలు తప్పవని స్పష్టం చేస్తోంది.

కాగా, కొంత కాలం క్రితం వరకు ప్లాంటులో నిత్యం యూనియన్ల సమావేశాలు జరుగుతుండేవి. స్టీల్‌ప్లాంట్‌లో పలు యూనియన్‌లకు, కాంట్రాక్టు కార్మిక సంఘాలకు ప్లాంటులో కొన్ని పాయింట్ (సమావేశాలు నిర్వహించుకునే ప్రదేశాలు)లు ఉన్నాయి. ఉదయం జనరల్ షిఫ్ట్ సమయానికి వెళ్లే ఉద్యోగులు ముందుగా వెళ్లి ఆయా యూనియన్ పాయింట్‌ల వద్ద చేరి కొన్ని విషయాలపై చర్చించుకునే వారు. అలాగే కొన్ని సందర్భాల్లో మధ్యాహ్న భోజన విరామ సమయంలో కూడా సమావేశాలు నిర్వహించుకునేవారు. ఈ మధ్యకాలంలో వీటిని యాజమాన్యం తీవ్రంగా పరిగణిస్తోంది. ప్లాంటులో పని ప్రదేశం వదిలి వెళ్లరాదని కఠిన నిబంధనలు అమలు చేయడంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు. ఎక్కడ సమావేశాలకు హాజరైతే యాజమాన్యం ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందోనని కార్మిక నాయకులు, ఉద్యోగుల్లో భయం వెంటాడుతోంది.

బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో 18న వైద్య శిబిరం

అగనంపూడి, మే 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం బ్రహ్మకుమారీస్ సంస్థ స్థానిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 18న బీసీ కాలనీలో గల దివ్యజ్యోతి భవనం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను బుధవారం సంస్థ ప్రతినిధులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ శిబిరంలో అన్ని రకాల అనారోగ్య సమస్యలకు సంబంధించి ఉచితంగా పరీక్షించి మందులు అందజేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బీకే రామకోటి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు హనుమంతురావు, బి.సత్యనారాయణ, మొల్లి కోటి, నరసింహమూర్తి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీబీఎస్‌సీ ఫలితాల్లో యాపిల్ ఐ స్కూలు జయకేతనం


12 తరగతి విద్యార్థి సోహినిని అభినందిస్తున్న తలశిల బలరామకృష్ణ

శ్రీనగర్, మే 14 (ఆంధ్రజ్యోతి) : సీబీఎస్ఈ-2025 విడుదలైన సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) 10 తరగతి, 12 తరగతి ఫలితాల్లో శ్రీనగర్ యాపిల్ ఐ స్కూలు విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచి, శత శాతం ఉత్తీర్ణత సాధించినట్టు యాపిల్ ఐ స్కూలు ఛైర్మన్ తలశిల బలరామకృష్ణ తెలిపారు. 12 తరగతి విద్యార్థి సోహిని 85 శాతం మార్కులతో, 10 తరగతి విద్యార్థి ఎస్.అక్షరకు 94 శాతం మార్కులతో స్కూలు టాపర్‌గా నిలిచారన్నారు. 88 మంది విద్యార్థులకు 88 మంది ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలు సాధించారని తెలిపారు. 90 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఈ పరీక్షలకు 12వతరగతిలో 24 మంది విద్యార్థులు హాజరవగా అందరూ ఉత్తీర్ణులై శతశాతం ఫలితాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా తలశిల బలరామకృష్ణ మాట్లాడుతూ తమ స్కూలు గత 11 ఏళ్లగా శత శాతం ఫలితాలు సాధిస్తూ విజయపరంపరతో రికార్డులు సాధించడం గర్వంగా ఉందన్నారు. ఇంతటి అద్భుత ఫలితాల వెనుక స్కూలు ప్రోగ్రాములు, అధ్యాపక, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉన్నాయని, వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ తలశిల ఉమామహేశ్వరరావు, ప్రిన్సి పాల్స్ ఎస్.విష్ణువర్ధన్‌రావు, జయశ్రీ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెందుర్తిలో చెరువు స్థలాలు కబ్జా


పెందుర్తిలో చెరువును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు (ఫైల్)

పెందుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి రెవెన్యూ పరిధిలోని చెరువులను కబ్జాదారులు చెర పడుతున్నారు. చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో చెరువుల రూపురేఖలు మారిపోయి ఊళ్లను తలపిస్తున్నాయి. జల వనరుల (వాటర్ బాడీస్) సంరక్షణ చట్టాన్ని సవాల్ చేస్తూ చెరువుల స్థలాన్ని పరాధీనం చేస్తున్నారు. పెందుర్తిలోని సర్వే సంఖ్య 230లో 20 ఎకరాల విస్తీర్ణం గల గోకాడ చెరువు ఆక్రమణలతో కుచించుకుపోయింది. కబ్జాదారుల దెబ్బకు పది ఎకరాలు పైగా ఆక్రమణకు గురైందని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి చెరువును ఆక్రమించి సుమారు 50 ఇళ్లు నిర్మించారని రెవెన్యూ అధికారులు అంటున్నారు. పెందుర్తిలో 6.85 ఎకరాల విస్తీర్ణం గల విజయ రామసాగర్ చెరువులో సుమారు రెండెకరాలు ఆక్రమించిన ఓ రియల్ వ్యాపారి సుమారు 40 ఇళ్లతో కాలనీ నిర్మించాడు. చినముషిడివాడలోని సర్వే నంబర్లు 165, 185, 186, 189లోని సుమారు 40 ఎకరాలు చెరువులో 25 ఎకరాలుపైగా ఆక్రమణకు గురైంది. ఇళ్లు, భారీ భవనాలు, బహుళ అంతస్తులు నిర్మించారు. చినముషిడివాడ, సుజాతనగర్‌లో చెరువును ఆక్రమించి షెడ్లు నిర్మించి రూ.లక్షల్లో విక్రయాలు జరుపుతున్నారు. చెరువు ఆక్రమణ వ్యవహారం ఈ ప్రాంతంలో భూ మాఫియాగా మారింది. కిష్టరాయపురం, లక్ష్మీపురంలోని రాముడు చెరువులు ఆక్రమణలతో కుచించుకుపోయాయి.

నోటీసులు జారీ చేసినా..

రెవెన్యూ నోటీసులు జారీ చేసినా ఆక్రమణల జోరు తగ్గటం లేదు. గత ఏడాది 15 ఎకరాల ఆక్రమణకు సంబంధించి 414 మందికి రెవెన్యూ సిబ్బంది నోటీసులు జారీ చేశారు. చెరువు, గెడ్డ, వాగులను ఆక్రమించారు. పెందుర్తిలో 257, చినముషిడివాడలో 73, వేపగుంటలో 25, లక్ష్మీపురంలో 8, సరిపల్లిలో 31, ఎస్ఆర్‌పురంలో 14, గుర్రంపాలెంలో 6 మొత్తంగా సుమారు 15 ఎకరాలు విస్తీర్ణంలో గల వాటర్ బాడీస్ ఆక్రమించి చేపట్టిన 414 మందికి సెక్షన్ 7 నోటీసులు జారీ చేశారు. ఏడాదిన్నర కాలంగా నోటీసులతో సరిపెడుతూ, ఆక్రమణల తొలగింపు జోలికి పోవటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. కోర్టుకు వెళ్లాలని కొందరు రెవెన్యూ సిబ్బందే ఆక్రమణదారులకు సలహాలు ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. చెరువుల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు తీసుకోకపోతే ఆక్రమణలతో బక్కచిక్కిన చెరువులకు వరదలు వస్తే పెందుర్తి ముంపు నకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నా యని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చెరువుల పరిరక్షణకు చర్యలు

రెవెన్యూ పరిధిలోని చెరువుల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. కొత్త మార్గదర్శకాలతో పట్టణ ప్రాంతాల్లోని చెరువులను జీవీఎంసీకి అప్పగించి సుందరీకరణ పనులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని శాఖాపరంగా తెలిపాం. దీంతో చెరువుల సంరక్షణ జరుగుతుంది. నీటి వనరులు ఆక్రమించుకుని నిర్మించిన చెరువు ఆక్రమణలపై దృష్టి సారిస్తాం.

-ఎం.ఆనందకుమార్, తహసీల్దార్

టీడీపీ బలోపేతానికి అందరూ కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పెందుర్తి ఇన్‌చార్జి గండి బాబ్జి తనయుడు వంశీ

టీడీపీ కార్యకర్తలకు గండి వంశీ సూచన

వేపగుంట, మే 14 (ఆంధ్రజ్యోతి): పార్టీలో చిన్న చిన్న విభేదాలు ఉన్నా, ప్రతీ ఒక్కరూ టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని తెదేపా పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జి తనయుడు వంశీ పేర్కొన్నారు. జీవీఎంసీ 93వ వార్డు పరిధిలోని తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం బుధవారం రాత్రి గోశాల దరి ఎస్.ఎన్.ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ అన్ని వార్డుల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేయాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే నేరుగా తెలియజేయాలని సూచించారు. పార్టీ ఆదేశాల మేరకు కూటమి పార్టీల సభ్యులను కలుపుకొని పనిచేయాలని సూచించారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి విజయానికి సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్పొరేటర్ రాపర్తికన్నా మాట్లాడుతూ పార్టీలో కొత్తగా ఇతర పార్టీ సభ్యులను చేర్పించేముందు వార్డు అధ్యక్షుడికి, ఇన్‌చార్జిలకు తెలియజేసి అభ్యంతరాలను అధిగమించి పనిచేయాలని సూచించారు. అనంతరం పాతకమిటీ సభ్యులను కొనసాగించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రస్తుతం గంగ వరహాలు అధ్యక్షుడిగా ఉన్న కమిటీని కొనసాగించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు కర్రి నూకరాజు, కర్రి పైడిరాజు, రాపర్తి శైలజ యశస్వి, శోభ తదితరులు పాల్గొన్నారు.

తల్లులు పౌష్టికాహారం తీసుకోవాలి

మల్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): తల్లులు పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని మల్కాపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. మల్కాపురం అంగన్‌వాడీ కేంద్రం భవనంపై ఉన్న సామాజిక భవనంలో సృజన వెల్ఫేర్ అసోసియేషన్ జ్యోతిశ్రీ, అనుశ్రావణి ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఆధ్వర్యంలో బుధవారం రక్తహీనతను అరికట్టడంపై అవగాహన కార్యక్రమం జరిగింది. అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారం తీసుకోవడం వలన ఆరోగ్య సమస్యలు ఉండవని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ వైద్యాధికారి డాక్టర్ నాన్సీ, మల్కాపురం జీవీఎంసీ ప్రాధానోపాధ్యాయులు పెద్దాడ హరికృష్ణ, సృజన వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి శ్రీలక్ష్మీ, కుమారి, దివ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్మూలనకు సూచనలు

సింధియా, మే 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 40వ వార్డులో జోన్-5 ప్రజారోగ్య సహాయ వైద్యాధికారి సునీల్ బుధవారం పర్యటించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిశ్రమ వద్ద గల ప్రధాన గెడ్డను, మిగతా గెడ్డలను పరిశీలించి పేరుకుపోతున్న వ్యర్థాలను ఎలా తొలగించాలో పలు సూచనలు చేశారు. వ్యర్థాలు ఎక్కువ ఉన్నట్లు గమనిస్తే వెంటనే ఫోటో తీసి ఆ చిత్రాలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు తెలియజేయాలని సూచించారు.

యోగాతో ఒత్తిడి దూరం

మల్కాపురం, మే 14 (ఆంధ్రజ్యోతి): యోగా వల్ల ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత పెరుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని మల్కాపురం శాఖా గ్రంథాలయాధికారి వి.అజేయ్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం ఆయన యోగా తరగతులను ప్రారంభించి మాట్లాడారు. యోగాను నిత్యజీవితంలో ఒక భాగం చేసుకోవాలన్నారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్, ఉద్యోగ నైపుణ్యాలపై యువజన నాయకులు కృపారాణి, శేషు, రామారావు, సుజన వివరించారు. బాలలు కొత్త ఇంగ్లీష్ పదాలను నేర్చుకున్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం

పెందుర్తి, మే 14 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి మండల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు విజ్ఞానం, వినోదం, పుస్తక పఠనం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. చదవడం, రాయడంలో తర్ఫీదు ఇచ్చారు. గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళ పాల్గొన్నారు.

కేంద్ర కారాగారంలో మళ్లీ రెండు సెల్‌ఫోన్ల కలకలం

ఆరిలోవ, మే 14(ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో గల కావేరి బ్యారెక్స్ వద్ద భూమిలో జరిపిన తవ్వకాలలో రెండు సెల్ ఫోన్లు మంగళవారం లభ్యమైనట్లు జైలు అధికారులు తెలిపారు. దీనిపై బుధవారం ఉదయం ఫిర్యాదు అందినట్టు ఆరిలోవ ఎస్ఐ కృష్ణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ ఇటీవల రాజమండ్రిలో జైలు సూపరింటెండెంట్స్‌తో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఇటీవల కడప కారాగారంలో తవ్వకాలు జరుపుతుండగా ఒక సెల్ ఫోన్ లభ్యమైనట్టు వెల్లడించారు. అలాగే ఇతర జైళ్లలో కూడా తవ్వకాలు చేపట్టాలని ఆదేశించారు. గతంలో విశాఖపట్నంలో కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్లు దొరికిన వైనాన్ని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ జైలులోని సుమారు 7 ఎకరాల స్థలంలో సుమారు రెండు అడుగుల లోతులో 8 చోట్ల తవ్వకాలు జరిపించారు. ఈ క్రమంలో కావేరి బ్యారెక్స్ సమీపంలో రెండు సెల్‌ఫోన్లు లభించాయి. అందులోని సిమ్‌లను పరిశీలించగా, గత అక్టోబర్‌లో వినియోగించినటట్టు తెలిసింది. మహిళలు ఉండే స్వర్ణముఖి బ్యారెక్స్‌తో పాటు ఏడు బ్యారెక్స్‌లో జైలు సిబ్బందితో ఈ తవ్వకాలు చేపట్టినట్టు తెలిపారు. జైలుకు నవంబరు నెల నుంచి కొత్త సిబ్బంది వచ్చిన తరువాత సెల్‌ఫోన్లు వాడలేదని సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. తాజాగా రెండు సెల్‌ఫోన్లు దొరికిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. ఈ కారాగారంలో ఇప్పటి వరకు ఆరు సెల్‌ఫోన్లు దొరికినట్టు చెప్పారు.

ఎండ ప్రచండం.. తగ్గిన జనసంచారం


మధ్యాహ్నం 2 గంటల సమయంలో నిర్మానుష్యంగా సింహాచలం రైల్వే స్టేషన్ పరిసరాల్లోని దుకాణాలు

గోపాలపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఎండతీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో ఆరుబయట జనసంచారం కానరావడం లేదు. మధ్యాహ్నం నుంచి ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారుతోంది. జనం రాకపోవడంతో దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసేస్తున్నారు. ఉదయం 11 నుంచి సాయింత్రం 4 గంటల వరకూ రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాలు ఎండదెబ్బకు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. పొద్దుపోయాక వ్యాపారాలు కాస్త ఊపందుకుంటున్నాయి. సింహాచలం ప్రాంతంలో బుధవారం కనిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీలుగా నమోదయ్యాయి. ఉక్కపోత, తాపానికి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఎండదెబ్బకు శీతల పానీయాలు విక్రయించే దుకాణాలు రద్దీగా కనిపిస్తున్నాయి. ఎండలో బయటకు వచ్చే ప్రతి ఒక్కరూ శీతలపానీయాలు సేవించడానికి ఎగబడుతుండడంతో చెరకు రసం, షోడా, లస్సీ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మధ్యాహ్నం వేళలో శీతల పానీయాల దుకాణాల వద్ద మాత్రమే జనం కనిపిస్తున్నారు.

వెడ్డింగ్ ఫొటోగ్రఫీలో నయా ట్రెండ్స్

మధుర జ్ఞాపకాన్ని పదిలపరుచుకునే ప్రక్రియ

- హైడెఫినిషన్ క్వాలిటీ ఉండేలా జాగ్రత్తలు
- జోరందుకున్న ప్రీ వెడ్డింగ్, పెళ్లి రోజు, పోస్టు వెడ్డింగ్ షూట్స్
- విదేశాలకు వెళ్లేందుకూ జంటల ఆసక్తి
- సినిమాలను తలపించేలా ప్రత్యేక సెట్‌లు
- ఖర్చుకు వెనుకాడని వధూవరులు

(ఎండాడ, ఆంధ్రజ్యోతి)



ఫొటో చెదిరిపోని జ్ఞాపకం. కాలం ఎంతగా పరుగెడుతున్నా, సాంకేతికత గుప్పిట్లో ఇమిడి పోతున్నా... మధుర స్మృతులను గుర్తుచేసేది ఫొటోనే. దానిని మరింత అందంగా మలచుకుని పదికాలాల పాటు పదిలంగా దాచుకునేందుకు తహతహలాడుతుంటారు. ప్రస్తుతం సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లలో భద్రపరచుకునే డిజిటల్ ఫొటోగ్రఫీ అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఆ చిత్రాన్ని బంధించేందుకు జరిగే కసరత్తు మాత్రం మారలేదు. అందునా వివాహాల సందర్భంగా తీసుకునే ఫొటోలు తరతరాలు నిలిచిపోవాలనే ఉత్సుకత ప్రస్తుత నవ దంపతుల్లో కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఖర్చుకు వెనుకాడకుండా అద్భుత చిత్రాలను బంధించేందుకు తగిన అవకాశాలను ఫొటో గ్రాఫర్లకు అందిస్తున్నారు.







కాలంతో పాటు అనేక మార్పులు వస్తుంటాయి.. ప్రస్తుతం వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోనూ ఇదే కనిపిస్తోంది. కుటుంబంలో ముందు తరం పెళ్లి ఫొటోలు చూశారా.. అందులో వారు నేరుగా కెమెరా వైపు చూస్తున్న దృశ్యాలు కనిపించకపోవచ్చు, అధిక శాతం ఫొటోల్లో వారి కళ్లు కిందకి గానీ ఏదో ఒక వైపునకు గానీ చూస్తున్నట్టు ఉంటుంది. కాలం మారడంతో వెడ్డింగ్ ఫొటోగ్రఫీ ట్రెండ్ మారింది.



ఇప్పుడు కొత్త జంటలు సువిశాల ప్రాంగణంలోని ప్రత్యేక సెట్టింగ్‌ల నడుమ ఫొటోలు క్లిక్ మనిపించుకుంటున్నాయి.

గతానికి భిన్నంగా...

ఈ తరం జంటలు వైరుధ్యాన్ని కోరుకుంటున్నాయి.. సోషల్ మీడియాలో బోలెడన్ని లైక్‌లు కురిపించేలా ఫొటోలు ఉండాలని తాపత్రయపడుతున్నాయి. వెడ్డింగ్ ఫొటోలు కేవలం జ్ఞాపకాలుగా మాత్రమే కాక, పదిమందికీ షేర్ చేయడం ద్వారా తమలోని ఊహాజనిత ప్రపంచానికి ఆదరణ లభించేలా రూపొందించుకుంటున్నాయి.

అపూర్వ జ్ఞాపకాలు..

ప్రస్తుతం వధూవరులే కాకుండా వారి కుటుంబ సభ్యుల ఫొటోలను జ్ఞాపకాలుగా బంధించి, వాటిని సరైన రీతిలో అలకంరించి దాచుకోవాలని భావిస్తున్నారు. అయినప్పటికీ అత్యధిక ఫోకస్ నవ దంపతులపైనే. పెళ్లి రోజు జీవితంలో ఎంతో ముఖ్యమైనది.

ఆచార, సంప్రదాయాల మధ్య ఈ మధురానుభూతిని పదిలపరిచేది ఫొటో.

సోషల్ మీడియా ప్రభావం

ప్రస్తుతం ప్రపంచం అరచేతిలో ఇమిడిపోయింది. తమ భావాలను, అద్భుత చిత్రాలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసుకునే స్వేచ్ఛ లభించింది. దీనిని వధూవరులు ప్రియంగా మార్చుకుంటున్నారు. ఇందుకోసం ఉత్తమ ఫొటోలను తీయగలిగే నిపుణులైన ఫొటోగ్రాఫర్స్‌ని ఎంచుకుంటున్నారు. ఫొటోలు, వీడియోలు సృజనాత్మకంగా ఉండాలని ఆశిస్తున్నారు. లేటెస్ట్ ట్రెండ్స్ అప్‌డేట్ అవుతూ ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్స్‌నీ వినియోగిస్తున్నారు. టెక్నాలజీకి తమ ప్యాషన్ హాబీని కలగలిపి అవుట్ డోర్ సెలబ్రేషన్స్‌లో డ్రెస్స్‌తో ఫొటో షూట్‌లు చేసుకుంటున్నారు.

క్యాండిడ్ ఫొటోగ్రఫీ..

కొందరు క్యాండిడ్ ఫొటోగ్రఫీని సెలక్ట్ చేసుకుంటే, మరి కొందరు పోజ్డ్ ఫొటోగ్రాఫ్స్ ఇష్టపడుతున్నారు. సాధారణంగా పోజ్డ్ ఫొటోగ్రాఫ్స్ చూసేందుకు అందంగా ఉంటాయి, కానీ వివాహతంతునంతా ఇలానే బంధిస్తే మజా ఉండదు. వాటిలో ఒకే తరహా నవ్వు, హావభావాలు, స్టయిల్స్ కనిపిస్తుంటాయి. కొత్తతరం ఫొటోగ్రఫీలో అనేక స్టయిల్స్‌లో న్యాచురల్ లుక్స్ దర్శనమిస్తుంటాయి. దీనికోసం ఫొటోగ్రాఫర్స్ డిజిటల్ ఫొటోగ్రఫీని ఎంచుకుంటున్నారు. హైడెఫినిషన్ డీఎస్ఎల్ఆర్‌లో వస్తున్న లేటెస్ట్ కెమెరాలను వినియోగిస్తున్నారు. వీటితో ఫొటోలు, వీడియోలు మంచి క్వాలిటీ రెజుల్యూషన్స్‌లో వస్తాయి.

వెడ్డింగ్ షూట్స్ ప్రత్యేకత

ఈ రోజుల్లో వెడ్డింగ్ ఫొటోగ్రఫీలోనూ మూడు దశలు కనిపిస్తున్నాయి. పెళ్లి ముందు ప్రీ వెడ్డింగ్, పెళ్లి రోజు, పోస్టువెడ్డింగ్ ఫొటోగ్రఫీ అని పిలుస్తున్నారు. పెళ్లి సంప్రదాయాలు ఎంగేజ్‌మెంట్, హల్దీ, మెహందీ వరకే పరిమతం కాకుండా ప్రత్యేకమైన ఫొటోలు తీయడం వల్ల వధూవరులు ఒకరినొకరు అర్థం చేసుకోగలుగుతారు. వెడ్డింగ్ షూట్ బెస్ట్ అనిపించుకోవాలంటే షూట్ అంతా ఒకే ఫొటోగ్రాఫర్‌తో చేయించుకోవడం ఉత్తమం. దీనివల్ల ట్యూనింగ్ సరిగా ఉంటుంది.

విభిన్న ప్రదేశాల్లో...

ప్రీ వెడ్డింగ్ షూట్ కస్టమర్ ఇష్టాన్నిబట్టి ఉంటుంది. కొందరు కొండలు, బీచ్‌లు, కోటలు, మహల్స్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇందుకోసం జైపూర్, కేరళ, అరకు, దుబాయ్, గోవా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర ప్రదేశాలకు వెళ్లి బడ్జెట్‌కి తగ్గట్టు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. కొందరు తక్కువ బడ్జెట్ అవుట్‌డోర్ లొకేషన్లు ఎంచుకుంటున్నారు. కైలాసగిరి, బీచ్, యారాడ వంటి ప్రదేశాల్లో ప్రతిరోజూ ఇలా ప్రీవెడ్డింగ్ షూట్‌లు జరుగుతున్నాయి. కాగా నగరంలో ప్రత్యేక స్టూడియోలు పుట్టుకొస్తున్నాయి. సినిమా షూటింగ్‌ల తరహాలో సెట్స్ వేసి ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తున్నారు. కాస్ట్యూమ్స్‌తో పాటు అన్ని రకాల వసతులు అందిస్తున్నారు. మరోకొందరు స్టోరీ రూపంలో షూట్ చేయించుకుంటున్నారు.

పోస్టువెడ్డింగ్ ఫొటోగ్రఫీ..

పోస్టు వెడ్డింగ్ షూట్‌కు కూడా ఇటీవల ఆదరణ పెరిగింది. నగరంలో ఉత్తమ లొకేషన్స్ సెలక్ట్ చేసుకుని హైటెక్నాలజీలో ఫొటో షూట్ చేయించుకుంటున్నారు. వీటిలో డ్రోన్ కెమెరాలు అధికంగా వినియోగిస్తున్నారు. అంతేకాదు పెళ్లి జరుగుతుండగానే క్లిప్స్ తీసి, వెంటనే ఎడిటింగ్ చేసి, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసే ట్రెండ్ ప్రస్తుతం జోరుగా సాగుతోందని నగరంలోని ఫొటోగ్రాఫర్ సుమంత్ వివరించారు.

రెండు తెలుగు రాష్ట్రాల్లో 90 ఇళ్లల్లో చోరీలు



నిందితుడు రామకృష్ణ (ఫైల్)

ఎంవీపీ కాలనీ, మే 14 (ఆంధ్రజ్యోతి) : రెండు తెలుగు రాష్ట్రాల్లో 90 చోరీలకు పాల్పడిన గజదొంగను అరెస్టు చేసినట్టు క్రైమ్ ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నగరంలోని మధురానగర్‌లోని రాధామాధవ టవర్స్‌లో మార్చి ఒకటో తేదీన జరిగిన దొంగతనం కేసులో నిందితుడు హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన తిప్పరాజు రామకృష్ణ అలియాస్ రాము అలియాస్ అభిరామ్, అలియాస్ శ్రీను (26)ను అరెస్టు చేసినట్టు తెలిపారు. ఈ చోరీలో 23 తులాల బంగారం, రూ.లక్ష నగదు దొంగిలించినట్టు చెప్పారు.. అపహరించిన సొత్తును హైదరాబాద్‌లో ఉంటున్న నిందితుడి మేనల్లుడు అశోక్, అతడి సోదరి భాగ్యమ్మ వద్ద దాస్తూ ఉండేవాడు. ఈ కేసులో నిందితుడి నుంచి రూ.పది వేలు స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అలాగే నిందితుడు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో సైతం చోరీలకు పాల్పడి ఉండడంతో దర్యాప్తు చేపట్టిన హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్ పోలీసులు ఇంతకు ముందు శ్రీనును అరెస్టు చేశారు. ఈ క్రమంలో నిందితుల నుంచి రూ.3.40 లక్షలు, 50 గ్రాములు, 26 గ్రాముల రెండు బంగారు నెక్లెస్‌లు, ఏడు గ్రాముల చెవి రింగుల జత స్వాధీనం చేసుకున్నట్టు ఏడీసీపీ మోహన్‌రావు తెలిపారు. నిందితుడు శ్రీను తెలుగు రాష్ట్రాల్లో 79 ఇళ్లల్లో చోరీలకు పాల్పడినట్టు చెప్పారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. సమావేశంలో ఏసీపీ లక్ష్మణరావు, సీఐ చక్రధర్, ఎస్సై రాజు పాల్గొన్నారు. కేసులో చురుగ్గా వ్యవహరించిన సిబ్బందిని అభినందించారు.



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

అప్పన్న హుండీల ఆదాయం రూ. 2.61 కోట్లు

సింహాచలం, మే 14 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు గత 21 రోజుల్లో ఆలయ హుండీల్లో సమర్పించిన కట్న, కానుకల ద్వారా రూ. 2.61 కోట్ల ఆదాయం సమకూరింది. బుధవారం దేవస్థానం ఈఓ ఎస్. సుజాత, ప్రత్యేక పరిశీలకుడు బండారు ప్రసాద్ పర్యవేక్షణలో సింహగిరిపై పరకామణి కేంద్రంలో హుండీల లెక్కింపు చేపట్టారు. నగదు రూపంలో రూ.2,61,95, 966 లభించగా 166 గ్రాముల స్వర్ణం, 17.9 కిలోల వెండి ఆభరణాల రూపంలో భక్తులు సమర్పించారు. వాటితో పాటు యూఎస్ఏకు చెందిన 15 డాలర్లు, సింగపూర్, యూ ఏఈ, మలేషియా, ఐర్లాండ్ తదితర పలు విదేశాలకు చెందిన కరెన్సీ కూడా లభించింది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ విశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, దేవస్థానం వివిధ విభాగాల ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు, పలు సేవా సంస్థల కార్యకర్తలు, పాల్గొన్నారు.

మోదకొండమ్మ పండగ ఆదాయం రూ.6 లక్షలు

- ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి) :పాడేరు మోదకొండమ్మ పండగకు 30 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా రూ.6 లక్షల అదనం ఆదాయం వచ్చినట్టు ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి. అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన మోదకొండమ్మ పండగకు రాకపోకలు సాగించే వారికోసం ఆర్టీసీ విశాఖ రీజియన్ నుంచి 30 ప్రత్యేక బస్సులు వేశామని తెలిపారు.

దేశాన్ని బీజేపీ అగ్రగామిగా నిలబెడుతుంది | ఎమ్మెల్సీ సోము వీర్రాజు

అక్కయ్యపాలెం, మే 14 (ఆంధ్రజ్యోతి): భారత దేశాన్ని బీజేపీ అగ్రగా మిగా నిలబెడుతుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. సాలిగ్రామపురంలోని సాగరమాల కన్వెన్షన్ హాల్లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాకిస్థాన్ భయపడి అభ్యర్థించడంతో యుద్ధం ఆగిందన్నారు. నెహ్రూ వల్లే ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. ఈ దేశంలో ఇబ్బందులకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని పేర్కొన్నారు. పాకిస్థాన్ ఎప్పుడూ భారతదేశాన్ని ఇబ్బంది పెడుతోందని చెప్పారు. దేశంలో అవినీతిలో కూరుకుపోయిన రాజకీయాలను బీజేపీ చొరవతో మార్పునకు కారణమయ్యాయన్నారు. కశ్మీరులో భారత దేశ జెండా ఎగురవేయడానికి వెళ్తే అక్కడ పాకిస్థాన్ లాంచర్లు తిరుగుతున్నాయన్నారు. అయినా సరే ప్రాణాలకు తెగించి మన జెండాను మోదీ ఎగురవేయించారన్నారు. 105 దేశాలకు అతి చౌకగా శాటిలైట్ ఎగురవేస్తున్న ఘనత మన ఇస్రోదన్నారు. ముష్కరులను ఒక్కరోజులో మట్టుబెట్టిన శక్తి మన దేశానికే ఉందని సోము వీర్రాజు స్పష్టం చేశారు.



బీజేపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ సోము వీర్రాజు

బీజేపీలో పలువురి చేరిక

ఎమ్మెల్సీ సోము వీర్రాజు సమక్షంలో పలువురు బీజేపీలో చేరారు. సాలిగ్రామపురంలో జరిగిన కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకుడు వీవీ వామనరావు, మరికొందరు బీజేపీలో చేరారు. వీరికి సోము వీర్రాజు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు ఆకర్షితులపై పార్టీలో చేరుతున్నట్లు వారు చెప్పారు. బీజేపీ నగర అధ్యక్షుడు పరశురామరాజు, నాయకులు నాగేంద్ర, ప్రకాశ్‌రెడ్డి, బొడ్డేటి కాశీవిశ్వనాథ్, విజయానందరెడ్డి పాల్గొన్నారు.

వచ్చే ఏడాది విశాఖలో రోలర్ స్కేటింగ్ నేషనల్ గేమ్స్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్ర జ్యోతి) విశాఖపట్నంలో వచ్చే ఏడాది రోలర్ స్కేటింగ్ నేషనల్ గేమ్స్ - 2026 నిర్వహించాలని ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ నిర్ణయిం చింది. ఇందుకు అవసరమైన మౌలిక వసతులు సమకూర్చాలని జిల్లా యంత్రాంగాన్ని కోరింది. వీఎంఆర్‌డీఏకు చెందిన బీచ్‌పార్కులో స్కేటింగ్ రింక్ ఉండడం, అక్కడ గతంలో ప లు పోటీలు నిర్వహించిన అనుభవం ఉన్న దృష్ట్యా ఈ బాధ్యతను వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. దీనిపై రాష్ట్ర అసోసియేషన్‌తో సమావేశం నిర్వహించగా..నేషనల్ గేమ్స్ కాబట్టి స్కేటింగ్ బోర్డు పార్కును నిర్మించాల్సి ఉంటుందని వారు సూచించారు. వారి అవసరాల మేరకు నిర్మాణం చేపట్టాలంటే 1,095 చ.మీ. విస్తీర్ణంలో పార్కు ఉండాలని డిజైన్ రూపొందించారు.

బీచ్ పార్కులో స్కేటింగ్ రింక్



సీబీఎస్ఈ ఫలితాల్లో ఓక్రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



అనుష్క | ఆరవ్ పాండే | అశుతోష్ సమంతరాయ్ | సిరిపురపు శ్రీకర్

భీమునిపట్నం (రూరల్) మే 14 (ఆంధ్ర జ్యోతి): భీమిలి మండలం సింగనబందలో గల ఓక్రిడ్జ్ పాఠశాలలో సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి పరీక్షల్లో తమ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి తెలిపారు. పదో తరగతిలో కందుల అనుష్క 500 మార్కులకు 484, ఆరవ్ పాండే 478 మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా 12వ తరగతిలో అశుతోష్ సమంతరాయ్ 500 మార్కులకు 442, సిరిపురపు శ్రీకర్ 439 మార్కులు సాధించినట్టు పేర్కొ న్నారు. కాగా తమ స్కూల్‌కు చెందిన ము గ్గురు న్యూరోడైవర్స్ విద్యార్థులు కూడా 12వ తరగతిని విజయవంతంగా పూర్తి చేశార న్నారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధిం చడం వెనక వారి కృషితో పాటు ఉపాధ్యా యుల నిబద్ధత, తల్లిదండ్రుల ప్రోత్సాహం కూ డా ఉందని శైలా భమిడిపాటి పేర్కొన్నారు.

కిరండూల్ రైళ్లకు ఏసీ చైర్‌కార్ కోచ్

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు అదనంగా ఒక ఏసీ చైర్‌కార్ కోచ్‌ను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501) రైలుకు ఈ నెల 17, 24, 31 తేదీల్లో...కిరండూల్-విశాఖ పాసింజర్ రైలుకు (58502) ఈ నెల 18, 25, జూన్ 1న ఒక ఏసీ చైర్ కార్ కోచ్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. అలాగే సంబల్‌పూర్-రాయగడ మధ్య రాకపోకలు సాగించే 18301, 18302 నంబరు గల రైళ్లకు ఈ నెల 16 నుంచి 31 వరకు ఒక ఏసీ చైర్‌కార్ కోచ్ జత చేశామన్నారు.

మహబూబాబాద్‌లో హాల్ట్ తొలగింపు

విశాఖపట్నం, మే 14 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని మహబూబాబాద్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు చేపడుతున్న నేపథ్యంలో పలు రైళ్లకు మహబూబాబాద్‌లో హాల్ట్‌ను తాత్కాలికంగా తొలగించి ప్రత్యామ్నాయంగా కేసముద్రం స్టేషన్‌లో హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్ (12727), విశాఖ-మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ (12861), భువనేశ్వర్-ముంబయి కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020), షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్‌కోస్ట్ (18045) రైళ్లు ఈ నెల 24 నుంచి 26 వరకు మహబూబాబాద్ స్టేషన్‌కు చేరకుండా కె.సముద్రం స్టేషన్‌లో ఆగుతాయని పేర్కొన్నారు.